J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 44 సంచిక : 39 28.02.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## పయ్యావుల 'పద్దు' - సంక్షేమమే ముద్దు


# మాటలు కాదు.. మూటలు కావాలి



- రాష్ట్ర బడ్జెట్‌పై ఆశలు పెట్టుకున్న జనం
- సూపర్‌సిక్స్ అమలుపై సర్వత్రా ఆసక్తి
- మాట తప్పితే చేటే అంటున్న విశ్లేషకులు
- రూ.3 లక్షల కోట్ల వరకూ ఉంటుందని అంచనాలు

ఓ వైపు అమరావతి, మరోవైపు పోలవరం.. మధ్యలో సూపర్ సిక్స్, ఇవీ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చంద్రబాబు ఇచ్చిన ప్రధాన హామీలు. వీటి సాధన కోసం వీలైనంతగా కేంద్రప్రభుత్వ సాయం పొందుతూనే, స్వశక్తితో గట్టెక్కాలని ఆయన చేయని ప్రయత్నం లేదు, వేయని ఎత్తులు లేవు. ఇలాంటి సమయంలో అప్పుల కుప్పగా మారిన రాష్ట్రానికి **2025-26** వార్షిక బడ్జెట్ దిక్సూచీ లాంటిదనడంలో అతిశయోక్తి లేదు. ప్రతిపక్షాలను, కూటమి పార్టీల నేతలను సంతృప్తిపరుస్తూ, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం అంత సులభం కాదు. ఈ నేపథ్యంలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, ఫిబ్రవరి 28న ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో వేటికి ప్రాధాన్యమిస్తారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నే.

10లో




## ఈ తరాన్ని తరింపజేసిన.. ఆధ్యాత్మిక అద్భుతం

12లో

# మహా కుంభమేళా!

- 65 కోట్ల భక్తజనంతో.. ఘనంగా ముగిసిన మహోజ్వల ఘట్టం
- భారత్ సత్తాకు జేజేలు పలుకుతున్న యావత్ ప్రపంచం


## 24వ వర్ధంతి

పూజ్యులు

స్వర్గీయ వేమిరెడ్డి శివకోటారెడ్డి గారు

నిర్యాణం: 06.03.2001

స్వర్గస్తులై 06.03.2025 నాటికి
24 సంవత్సరాలు నిండుతాయి.

వారి ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారుడు:
వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి
నెల్లూరు లోక్‌సభ సభ్యులు



# జోహార్ నల్లపరెడ్డి శీనయ్య!

## సంస్మరించుకున్న అభిమానులు



మాజీ మంత్రి, విలువలున్న నాయకుడు, రైతుజన బాంధవుడు స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి 32వ వర్ధంతి ఫిబ్రవరి 23 ఆదివారం నాడు జరిగింది. ఈ సందర్భంగా కోటలోని శీనయ్య అభిమానులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ న్యాయవాది, కోట బార్ అసోసియేషన్ అధ్యక్షులు పెల్లేటి గోపాలరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తెలుగుగంగ కాలువ శీనయ్య పుణ్యమే అని, ఆ కెనాల్‌కి శ్రీనివాసులరెడ్డి పేరు పెట్టాలని ఈ సందర్భంగా గోపాలరెడ్డి రాష్ట్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# స్థానిక పత్రికలకు ఆదరణ కరువైంది



స్థానిక పత్రికల ప్రాధాన్యత పెరిగినా వాటికి ఆదరణ కరువైందని, పాత్రికేయ రంగంలోని సమస్యల పరిష్కారానికి జర్నలిస్టులు ఐక్యతతో వ్యవహరించాలని ఏపీయు డబ్ల్యుజె నాయకుడు అనుమల జయప్రకాష్ కోరారు. ఈనెల 25న నెల్లూరు పెస్‌క్లబ్‌లో జరిగిన 'స్టేట్ స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్' (సామ్నా) ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి ముందు పత్రికా రంగం ప్రజల సంక్షేమం–ప్రజల సమస్యలు పరిష్కరించటంతో పాటు, స్వాతంత్ర్య పోరాటంలో కూడా చురుగ్గా పాల్గొనిందని గుర్తుచేశారు. విలేకరులు, సబ్‌ఎడిటర్లు, ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు అందరూ ఏకమై సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. తొలుత, 'సామ్నా' జిల్లా అధ్యక్షుడు ఇటీవల దివంగతులైన సర్వేపల్లి రామమూర్తి స్మృతికి సంతాపం ప్రకటించారు. అనంతరం, అతిథులను.. నూతనంగా ఎన్నికైన కమిటీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీయుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు వి.వెంకటేశ్వర్లు ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు టి.రమేష్‌బాబు, ఏపీయుడబ్ల్యుజే జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్ రెడ్డి, కోశాధికారి జి.హనోక్, 'సామ్నా' రాష్ట్ర కార్యవర్గసభ్యులు టీ గోపినాథ్ పాల్గొన్నారు.

### 'సామ్నా' నూతన కమిటీ...

ఈ సందర్భంగా సామ్నా ('స్టేట్ స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్)కి నూతన కమిటీని ఏర్పాటుచేసుకున్నారు. గౌరవ సలహాదారులుగా ఎస్.రామారావు, గౌరవ అధ్యక్షుడుగా సింహపురి బాబు, అధ్యక్షులుగా వేలూరు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా చక్రం దినేష్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సిహెచ్ మనోహర్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీలుగా ఎస్.సురేష్, ఎం.శ్రీనివాసులు, ఎస్.మస్తానయ్య, ట్రెజరర్‌గా సునీల్‌గవాస్కర్, ఉపాధ్యక్షులుగా కె.నాగేశ్వరావు, వెంకటేశ్వర్లు, బి.సుబ్రహ్మణ్యం, కార్యవర్గ సభ్యులుగా వినయ్, అక్మల్ నియమితులయ్యారు.

## బోగోలు అడవుల్లో వన్యప్రాణుల వేటపై..

# అటవీ అధికారుల నిఘా!

నెల్లూరుజిల్లా బోగోలు మండలంలోని తాళ్ళూరు, రామస్వామిపాళెం, వెస్టరన్ కాలనీ తదితర ప్రాంతాల సమీపంలో ఉండే అటవీప్రాంతాల్లో వన్యప్రాణుల వేట సాగుతోందనే సమాచారంతో అటవీ అధికారులు ముమ్మరంగా నిఘా పెట్టారు. అటవీశాఖ అధికారి సుమన్, అటవీ సిబ్బంది కలసి ఇటీవల రాత్రిపూట అడవుల్లో గాలింపు చర్యలు, తనిఖీలు చేపట్టారు. ఈ అటవీప్రాంతాల్లో జింకలు, అడవి పందులు తదితర వన్యప్రాణులు ఎక్కువగా ఉన్నాయని తెలిసి వేటగాళ్ళు, అక్రమార్కులు వాటిని వేటాడి డబ్బు సంపాదించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోందని, అలాంటివారిపై చర్యలు తప్పవని అటవీ అధికారులు చెప్తున్నారు. జంతువులను, వన్యప్రాణులను వేటాడడం నేరమని, దుండగులపై కఠినచర్యలు తప్పవని, కేసులు నమోదుచేస్తామని అటవీ అధికారులు స్పష్టం చేశారు. అడవిపందులు పంటలను పాడుచేస్తున్నాయంటూ పలు గ్రామాల్లో కొంతమంది రైతులు పంటపొలాల వద్ద విద్యుత్ తీగలను ఏర్పాటు చేస్తున్నారని, అలాంటి చర్యలకు పాల్పడకుండా అటవీ అధికారులు రైతులకు హెచ్చరికలు చేస్తున్నారు. విద్యుత్‌వైర్ల వల్ల జంతువులకే కాక, మనుషులకు కూడా ప్రమాదం ఉంటుందన్నారు.

## 'బొబ్బల'కు..

# నగరాధ్యక్ష పదవి ఇవ్వండి

### ప్రతిపాదించిన ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్‌కు వైకాపా నెల్లూరు నగరాధ్యక్ష పదవిని ఇవ్వండంటూ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయ కర్త, వైకాపా సీనియర్ నాయకులు ఆనం విజయకుమార్‌రెడ్డి ఈనెల 25న వైకాపా జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి విజ్ఞప్తిచేశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం తరఫున తాము ఆ పదవికి బొబ్బల పేరును ప్రతిపాదిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా రాజకీయాలపై ఆయన కాకాణితో చర్చించారు. అనంతరం, బొబ్బల నియామక ప్రతిపాదనకు సహకరించిన నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్త.. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి ఆనం విజయ కుమార్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

# 2న.. 'కృష్ణ గాన మంజరి'

నెల్లూరులోని భారతీ సంగీత విద్యాలయం 17వ వార్షికోత్సవం సందర్భంగా మార్చి 2వ తేది ఆదివారం సాయంత్రం 6 గంటలకు స్థానిక టౌన్‌హాల్‌లో ప్రముఖ సంగీత విద్వాంసురాలు ఏ.రమాదేవి శిష్య బృందంతో 'కృష్ణ గాన మంజరి' కర్నాటక సంప్రదాయ భక్తి సంగీత విభావరి నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ వయోలిన్ వాద్య కారులు, కంచికామకోటి పీఠం ఆస్థాన విద్వాంసులు ముల్లైవాసల్ డా.జి.చంద్ర మౌళికి ఆత్మీయ పురస్కారం అందజేస్తామన్నారు. టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి, బయ్యా వాసు (శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత), తెలంగాణ హైకోర్టు సీనియర్ అడ్వొకేట్ సోమ హరనాథ్‌రెడ్డి, ఇతాకా ఇంటర్నేషనల్ స్కూల్ జనరల్ మేనేజర్ జీవన్, ప్రముఖ హోమియోపతి వైద్యులు డాక్టర్ ఆర్.శ్రీనివాసకుమార్, మేఘన ఆటోమొబైల్స్ మేనేజింగ్ డైరెక్టర్ జీవీ రత్నం తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. సంగీతాభిమానులందరూ ఈ కార్యక్రమానికి తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు.

## ప్రశాంతంగా..

# గ్రూప్ 2 మెయిన్స్

జిల్లా వ్యాప్తంగా ఏడు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన గ్రూప్–2 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్షల సమన్వయ అధికారి, కందుకూరు సబ్ కలెక్టర్ టి.శ్రీపూజ ఆధ్వర్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం నిర్వహించిన పరీక్షలకు 4102 మంది అభ్యర్థులకు గాను 3548 అభ్యర్థులు హాజరు కాగా, 554 మంది అభ్యర్థులు పరీక్షలకు రాలేదు. దీంతో 86.5 శాతం హాజరు ఆమె తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు కూడా 4102 మంది అభ్యర్థులకు గాను 3546 అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. 556 మంది అభ్యర్థులు గైర్హాజరై, 86.4 శాతం హాజరు నమోదైంది.

## కుంభమేళా ఏర్పాట్ల అధ్యయనంలో..

# మంత్రి నారాయణ బృందం



ఆంధ్రప్రదేశ్‌లో 2027లో పెద్దఎత్తున జరుగనున్న గోదావరి పుష్కరాలు విజయవంతం అయ్యేందుకు ఇప్పటినుంచే ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ప్రపంచంలోనే అత్యంత గొప్పదైన మహాకుంభమేళా ఏర్పాట్లను అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ ఆధ్వర్యంలో ప్రయాగ్‌రాజ్‌కు పరిశీలక బృందాన్ని పంపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో రెండురోజుల పాటు మహాకుంభమేళా ఏర్పాట్ల పరిశీలనకు మంత్రి నారాయణతో పాటు, మున్సిపల్ శాఖ కమిషనర్– డైరెక్టర్ సంపత్‌కుమార్, రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్ బయలుదేరి వెళ్ళారు. అలహాబాద్ నుంచి ప్రయాగరాజ్ చేరుకున్న ఆ బృందానికి కుంభమేళా పర్యవేక్షణాధికారి విజయ్‌కిరణ్ ఆనంద్ స్వాగతం పలికారు. కుంభమేళాను విజయవంతంగా నిర్వహించేందుకు చేసిన ఏర్పాట్ల గురించి ఆయన మన మంత్రి బృందానికి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. కుంభమేళా కోసం ఎప్పటి నుంచి ఏర్పాట్లు ప్రారంభించింది, ఎంతమందికి ఏర్పాట్లు చేశారు, భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ప్రాంతాలు తదితర అంశాల గురించి ఆ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌ద్వారా వివరించారు. ఆ తర్వాత, అక్కడి నుంచి మంత్రి బృందం మహా కుంభమేళా అథారిటీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు చేరుకుని, అక్కడి ఏర్పాట్లు పరిశీలించింది... మొత్తం మహా కుంభమేళా జరిగే ప్రాంతాన్ని ఇక్కడి నుంచే మానిటర్ చేయనున్నారు. ముఖ్యంగా భక్తుల రద్దీని పర్యవేక్షిస్తూ తగిన అదేశాలివ్వడం, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నివారణపై ఎప్పటికప్పుడు కమాండ్ కంట్రోల్ రూం నుంచి తగిన అదేశాలిస్తున్నట్లు అక్కడి పోలీసు అధికారులు ఆ బృందానికి వివరించారు. ఆ తర్వాత మహా కుంభమేళా ఘాట్ల వద్దకు వెళ్ళి, ఏర్పాట్లను మంత్రి నారాయణ స్వయంగా పరిశీలించారు. ఘాట్ల వద్ద భక్తులకోసం చేసిన ఏర్పాట్లు, రద్దీని క్రమబద్ధీకరించే పద్ధతులను పరిశీలించారు. కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాల ఏర్పాట్లు బాగా ఉండాలని ప్రభుత్వం భావిస్తున్న తరుణంలో.. మంత్రి బృందం రెండురోజులు అక్కడేఉండి కుంభమేళా ఏర్పాట్లను అధ్యయనం చేసింది.

# అర్హులైన పేదలందరికీ ఇళ్లిస్తాం!

### -- సర్వే చేయండని అధికారులను ఆదేశించిన కలెక్టర్ --



అర్హులైన పేదలందరికీ ఇళ్ళు ఇవ్వాలనే ధ్యేయంతో పనిచేస్తున్నామని, అందుకు అనుగుణంగా చేయాల్సిన పీఎంఏవై 2.0 డిమాండ్ సర్వేని త్వరగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇల్లు లేని నిరుపేదలు ఎవరూ ఉండకూడదని, అర్హులైన వారందరికీ ఇళ్ల మంజూరుకు సిద్ధంచేయాలని ఆయన చెప్పారు. ఈనెల 24న నెల్లూరు కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేయాలనే ఉద్దేశంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇళ్లను మంజూరు చేస్తున్నాయని, ఈ సదవకాశాన్ని నిరుపేదలందరూ వినియోగించుకునేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఒకవేళ గతంలో ఇల్లు మంజూరై శిథిలావస్థకు చేరినవాటిని, నివాసయోగ్యం కాని ఇళ్లను కూడా గుర్తించి, ఆ వివరాలను గృహనిర్మాణాల శాఖకు అందజేయాలని, వారందరికీ కూడా కొత్త ఇల్లు మంజూరయ్యేలా చర్యలు చేపడతామని చెప్పారు. చాలా మండలాలు ఉపాధి పనుల కల్పనలో ఇంకా వెనుకబడి ఉన్నాయని, ఆ పనుల్లో నిర్లక్ష్యంగా ఉంటున్న అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆధార్ కార్డులు లేని గిరిజనులకు బర్త్ సర్టిఫికెట్లు ఇప్పించి ఆధార్ కార్డులను మంజూరు చేయాలని, ఈ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తహశీల్దార్లు, ఎంపీడీవోలకు సూచించారు. పిఎం సూర్యఘర్ యోజన పథకంపై పూర్తిస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని, ఈ పథకం ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న లబ్ధిదారులందరికి కూడా వెంటనే సోలార్ ప్యానల్స్ అమర్చేందుకు వేగవంతంగా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారంపై కూడా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. జడ్పీ సీఈవో విద్యారమ, హౌసింగ్, డ్వామా పీడీలు వేణుగోపాల్, గంగా భవాని, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి ఆసరాగా.. వేమిరెడ్డి

## ○ పొట్టేపాళెం వంతెనకి.. 35 లక్షలు మంజూరు



రాష్ట్రవ్యాప్తంగా అనేక ధార్మిక కార్యక్రమాలను తామే స్వయంగా నిర్వహించడమే కాక, జిల్లాలో అనేక అభివృద్ధి పనులకు కూడా అండగా నిలుస్తూ అందరి అభిమానం అందుకుంటున్నారు.. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. ఇటీవల నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టేపాళెం గ్రామంలో, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి.. ఆయన సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిలతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన సాగిస్తూ, రాష్ట్రాన్ని ప్రగతిపథంలో పయనింపజేస్తున్నారని కొనియాడారు. నెల్లూరు రూరల్‌లో 'గడపగడపకు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి' కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజాభిమానం పొందుతున్న కోటంరెడ్డి సోదరులను ఆయన అభినందించారు. పొట్టేపాళెం వద్ద బ్రిడ్జి నిర్మాణానికి తమ ఎంపీ నిధుల నుంచి 35లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా ప్రకటించారు.

### నెల్లూరుకు శాశ్వత ఎంపీగా వేమిరెడ్డి ఉండాలి - శ్రీధర్‌రెడ్డి

నిరంతరం ప్రజల కోసం పనిచేస్తూ,, తన సొంత ధనంతో జిల్లాలో అనేక ప్రజోపయోగ కార్యక్రమాలకు అండగా ఉంటూ.. ప్రజలందరికీ అభిమానపాత్రులైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నెల్లూరుకు శాశ్వత ఎంపీగా ఉండాలని తాను కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. తనకు రూరల్ ప్రజలు రాజకీయంగా జన్మనిచ్చారని, వారి మేలు ఎప్పటికీ మరచిపోలేనని అన్నారు. ఈ కార్యక్రమంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# జనసేన గూటికి చిట్టమూరు ప్రవీణ్‌రెడ్డి!



సినీ నిర్మాతగా, వ్యాపారవేత్తగా, రాజకీయ నేతగా నెల్లూరీయులకి సుపరిచితుడు చిట్టమూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఫిబ్రవరి 25వ తేదీ జనసేన తీర్థం పుచ్చుకున్నారు. తన ఆప్తమిత్రుడు.. మాజీమంత్రి బాలినేని శ్రీనివాసులరెడ్డి తోడురాగా మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో పవన్ కళ్యాణ్ చేత ఆయన జనసేన కండువా కప్పించుకున్నారు.

మద్రాసులోని పచ్చయప్ప కాలేజీలో హిస్టరీలో మాస్టర్స్ చేసి మద్రాస్ యూనివర్సిటీ నుండి ఎం.ఎ డిగ్రీపుచ్చుకుని 1983లో ఆయన బయటకొచ్చారు. అనంతరం 1986లో సినిమారంగంలో అడుగుపెట్టారు. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఘర్షణ, గీతాంజలి సినిమాలకి నిర్మాతగా వ్యవహరించారు. ఆ తరువాత 1989లో అనూహ్యంగా రాజకీయాలలో ప్రవేశించారు. మాగుంట కుటుంబానికి ప్రవీణ్‌రెడ్డి సమీపబంధువు, ఆత్మబంధువు కూడా. 1989 ఎన్నికలలో పరోక్ష రాజకీయాలలో చురుకుగా పాల్గొంటుండిన మాగుంట సుబ్బరామిరెడ్డి స్ఫూర్తితో ప్రవీణ్‌రెడ్డి కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఆయన ఆశీస్సులతోనే జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమింపబడి సుదీర్ఘకాలం అంటే సుమారు 7 సంవత్సరాలు ఆ పార్టీ కోసం పనిచేశారు. 2001లో ఆయనే స్వచ్ఛందంగా ఆ పదవికి రాజీనామా చేశారు. డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డిపై వున్న అభిమానంతో జగన్‌మోహన్‌రెడ్డికి అండగా వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ అభ్యున్నతి కోసం ప్రవీణ్‌రెడ్డి కృషి సల్పారు. తన చిరకాల నేస్తం కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి సంఘీభావం ప్రకటించి 2023 జనవరిలో వైసీపీకి గుడ్ బై చెప్పి, శ్రీధర్‌తో పాటు బయటకొచ్చారు. ఏ పార్టీలో వున్నా.. ఆ పార్టీ కోసం ఆయన పాటుపడడం తప్ప ఆ పార్టీల వల్ల ఆయనకి ఒరిగిందేమీ లేదు. పైగా కొన్ని ఇబ్బందులని కూడా ఆయన ఎదుర్కొన్నారు. 2024 ఎన్నికలలో కూటమి అభ్యర్థుల విజయం కోసం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పనిచేశారు.

ప్రస్తుత రాజకీయాలలో పవన్ కళ్యాణ్ లాంటి స్వతంత్ర భావాలు కలిగిన వ్యక్తులు చాలా అవసరమని ప్రవీణ్‌రెడ్డి అన్నారు. అందుకోసమే తాను జనసేనలో చేరినట్లు ప్రకటించారు. జనసేనలో తనకి చోటు కల్పించిన పవన్ కళ్యాణ్‌కి, తనని ప్రోత్సహించి స్ఫూర్తి కల్పించిన బాలినేని శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర టిడ్కో ఛైర్మెన్ సర్వేపల్లి అజయ్‌కుమార్‌లకి ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సమర్థతని, చిత్తశుద్ధిని, నిజాయితీని గుర్తించి జనసేన పార్టీ ఆయనకి సముచిత స్థానం కల్పిస్తుందని ఆశిద్దాం...!

# ఆయన తగ్గినా.. పోలీసులు తగ్గలేదు

## ○ పోసానిని పోలీసులు అరెస్టు చేశారు



పోసాని కృష్ణమురళి. ఆయన రాజకీయ నాయకుడు కాదు. కేవలం సినిమా నటుడు. అది కూడా క్యారెక్టర్ ఆర్టిస్టు. కానీ, నిజ జీవితంలో క్యారెక్టర్ లేనివాడిలా ప్రవర్తించాడు. తన నోటికొచ్చినట్లు రాజకీయ నేతలని దూషించాడు. వైసీపీ అండతో చంద్రబాబుని, పవన్ కళ్యాణ్‌ని, లోకేష్‌ని తనకిష్టమొచ్చిన బూతులతో తిట్టాడు. ప్రెస్‌మీట్‌లలో రెచ్చిపోయాడు. పత్రికలలో సైతం రాయలేని భాషతో చెలరేగిపోయాడు. ఫలితంగా అందుకు కానుకగా వైసీపీ ఎఫ్.డీ.సీ ఛైర్మెన్ పదవి కట్టబెట్టింది. దాంతో మరీ పెట్రేగిపోయాడు. మళ్ళీ వైసీపీయే అధికారంలోకి వస్తుందన్న మితిమీరిన విశ్వాసంతో కళ్ళు మూసుకుపోయి కూటమి నేతలపై బూతు పురాణం కురిపించాడు. అయితే, పాపం వైసీపీ ఓడిపోగానే కళ్ళు తెరిచాడు, వెనక్కితగ్గాడు. తాను రాజకీయాలకి గుడ్‌బై చెప్తున్నానని ప్రకటించాడు. ఇక జీవితంలో రాజకీయాల జోలికి రానని శపథం చేశాడు. కానీ, పోలీసులు తగ్గలేదు. పోసానిపై నమోదైన 10 కేసులలో భాగంగా ఒక కేసుకి సంబంధించి బుధవారం రాత్రి అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె పోలీసులు పోసాని కృష్ణమురళిని అరెస్టు చేశారు.

ఆయన నటించిన కొన్ని సినిమాల పేర్లు పరిశీలిస్తే... మనకి ఆశ్చర్యం కలుగుతుంది. ఉదాహారణకి... మెంటల్ కృష్ణ, దుశ్శాసన, ఎవడ్రా రౌడీ, నియంత, తిక్క, తింగరోడు, పోటుగాడు, ఆకతాయి, ఇగో, లోఫర్, ఛీటర్ ఇలాంటి చాలా సినిమాలలో పోసాని నటించారు. కొన్నిటిలో ఆయనే హీరో. నిజజీవితంలో కూడా ఆ సినిమాలలో పాత్రనే పోషిస్తే తప్పు లేదనుకున్నాడో ఏమో పాపం, ఇష్టానుసారం రెచ్చిపోయి కష్టాలు కొని తెచ్చుకున్నాడు. పోలీసులు అరెస్టు చేసే సమయంలో కూడా వారిపైన తిరగబడ్డాడు. హీరోయిజం చూపించాలని చూశాడు. కానీ, పోలీసుల ముందు ఆయన వేషాలు పనిచేయలేదు. పోలీసు వాహనం ఎక్కించి ఓబులవారిపల్లె పోలీసుస్టేషన్‌కి తీసుకెళ్లారు. గురువారం సాయంత్రం వరకు పోలీసులు పోసానిని విచారిస్తూనే ఉన్నారు. విచారణ అనంతరం రైల్వేకోడూరు కోర్టులో హాజరుపరచనున్నారని సమాచారం. అందుకే కాబోలు మన పెద్దలు "నోరుమంచిదైతే ఊరు మంచిదని" చెప్పారు.

# దుంగలతో పాటు.. దొంగలు దొరికారు

ఎంతో విలువైన ఎర్రచందనం దుంగల్ని అడ్డదారుల్లో తరలిస్తున్న నలుగురు అడవిదొంగలను స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, అటవీ సిబ్బంది ఈనెల 26న పట్టుకున్నారు. సాధారణంగా అనేక సంఘటనల్లో పోలీసులు వెంబడించినప్పుడు దుండగులు ఎర్రచందనం దుంగల్ని వదిలేసి పారిపోతుంటారు. ఈ సంఘటనలో దుంగలతో పాటు నలుగురు దొంగలు కూడా దొరికారు. ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతోందనే సమాచారంతో తిరుపతి-నెల్లూరు జిల్లాలకి చెందిన టాస్క్‌ఫోర్స్ ఉన్నతాధికారులు, అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. అడవుల్లో ముమ్మరంగా గాలింపు చేపట్టారు. అర్ధరాత్రి సమయంలో, రాపూరు మండలం గండూరుపల్లి వద్ద అనుమానాస్పదంగా తిరుగాడుతున్న నలుగురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. తరలించేందుకు సిద్ధంగా ఉంచుకున్న 12 ఎర్రచందనం దుంగల్ని, రెండు ద్విచక్రవాహనాలని స్వాధీనం చేసుకున్నారు. అయితే, వారితో పాటు ఉన్న మరికొందరు పారిపోయారు. దొరికిన వారిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. పారిపోయిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# మార్మోగిన 'శివ'నామం!

## భక్తజన కోలాహలం.. మహాశివరాత్రి సంరంభం

*'ఓం నమఃశివాయ'.. పంచాక్షరీ మంత్రంతో, భక్తులు పెద్దపెట్టున చేసిన శివ నామోచ్ఛరణలతో జిల్లాలోని అన్ని శివాలయాలు మార్మోగిపోయాయి. పలుదేవాలయాల్లో అర్ధరాత్రి సమయంలో జరిగిన లింగోద్భవాభిషేకాలు, ప్రత్యేకపూజలను ప్రజలు కళ్ళారా తిలకించి తరించిపోయారు. కొండలు కోనల్లో, నదులు సముద్రతీరాల్లో ఉన్న అనేక శివాలయాల్లోనూ శివరాత్రి వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి.*

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవాలయంలో విశేషపూజలు, వెండినందిపై స్వామివార్ల ఊరేగింపు వైభవంగా జరిగాయి. గండవరంలో గంగా-పార్వతి సమేత శ్రీ ఉదయకళేశ్వరస్వామి దేవాలయంలో శివరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. రామతీర్థంలో కామాక్షిదేవి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు సముద్రస్నానాలాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. రాపూరు మండలంలోని సిద్ధేశ్వరకోనకు భక్తులు వేలాదిగా తరలివచ్చి పూజలు చేసుకున్నారు. కావలి, కోవూరు, కొడవలూరు, మైపాడు, కాటేపల్లి, పొదలకూరు,



తోటపల్లిగూడూరు ఇలా.. ఒకటేమిటి జిల్లాలోని అన్ని శివాలయాల్లో మహాశివరాత్రి పర్వదినాన విశిష్ట పూజలు, విశేష సేవలు నిర్వహించారు.

### సర్వత్రా పూజలు..హోమాలు :

నెల్లూరు, దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో కొలువై ఉన్న మీనాక్షిదేవి సమేత శ్రీ సుందరేశ్వరస్వామి సన్నిధిలో మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, రుద్రహోమాలు నిర్వహించారు. అనంతరం, శివపార్వతుల కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. శ్రీశైల మల్లికార్జునస్వామి దేవాలయం మాజీ పాలకమండలి సభ్యులు ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి దంపతులు కల్యాణోత్సవానికి ఉభయకర్తలుగా వ్యవహరించారు. నెల్లూరు సమీపంలోని 'అడవిలో శివాలయం'లోని పరమేశ్వరుని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దర్శించుకుని పూజలు చేశారు.

### స్వర్ణలింగేశ్వరునికి విశేషాభిషేకాలు



నెల్లూరు, స్వర్ణాల చెరువుగట్టున వెలసి ఉన్న శ్రీ స్వర్ణలింగేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి పూజలు వైభవంగా జరిగాయి. నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి -విజిత దంపతులు గణేష్‌ఘాట్ వద్ద స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. బీజేపీ నాయకుడు పి.సురేంద్రరెడ్డి కూడా స్వర్ణలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

లాయర్
ఫిబ్రవరి 28, 2025

# 'ఊబకాయం'.. బతుకంతా నరకప్రాయం!

కరోనా ముప్పు ఎలాగో తప్పిందని అనుకుంటూ.. బతుకు జీవుడా అని ప్రాణాలు అరచేతిలో పట్టుకుని బతుకుతున్న నేటి ఆధునిక కాలంలో.. దేశవ్యాప్తంగా ఏదో ఒకరకమైన ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. అలాంటి ఆందోళనకరమైన వ్యాధుల్లో 'ఊబకాయం' ఒకటి. ఇది ఏ కొద్దిమందికో కాదు..ప్రపంచవ్యాప్తంగా పెద్ద సమస్యగా ఉంది. మనదేశంలో కూడా ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తూ..చాపకింద నీరులా.. అతిపెద్ద ముప్పుగా కూడా తయారవుతోంది. దేశజనాభాలో 24 శాతం మంది మహిళలు, 22.9 శాతం మంది పురుషులు ఊబకాయంతో ఉన్నారంటే ఈ సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్ధమవుతుంది. 'ఊబకాయం'లో.. అమెరికా మరియు చైనా తర్వాత మనదేశం ప్రపంచంలో మూడవ స్థానంలో ఉండడం గమనార్హం. ముఖ్యంగా జీవనశైలిలో వస్తున్న మార్పుల వల్లనే ఇలాంటి దీర్ఘకాలిక వ్యాధులు వస్తున్నాయి. సాధారణంగా శరీరంలో అసాధారణంగా లేదా అధికంగా కొవ్వు పేరుకుపోవడం వల్ల 'ఊబకాయం' వస్తుంది. దీన్నే స్థూలకాయం (ఒబేసిటీ) అని కూడా అంటుంటారు. దీనివల్ల ఆరోగ్యానికి ఎంతో ఇబ్బందిగా ఉండడమే కాక, హానికరం కూడా. ఎక్కువగా తినడం, తక్కువగా కదలడం వల్ల స్థూలకాయం వస్తుందని వైద్యులు అంటుంటారు. మధుమేహం, ఎముకలు బలహీనపడడం, కొన్నిరకాల క్యాన్సర్లకు దారితీయడం వంటివే కాక, ప్రధానంగా గుండెజబ్బుల ప్రమాదాన్ని కూడా ఈ వ్యాధి పెంచుతుందని నిపుణులు చెప్తున్నారు. ప్రపంచ ఒబేసిటీ అట్లాస్ 2024 అంచనాల ప్రకారం..2035 నాటికి దాదాపు 3.3 బిలియన్ల మంది పెద్దలు ఊబకాయంతో ఇబ్బందులు పడతారని, 19 ఏళ్లలోపుండే టీనేజ్ యువకులు అదే సంవత్సరం నాటికి 770 మిలియన్లకు పైగా పెరుగుతారనే గణాంకాలన్నీ చూస్తుంటే ఊబకాయం కాదు..ఒకేసారి మనందరికీ రక్తపోటు వచ్చేలా ఉంటుంది. వాస్తవానికి మనదేశంలో ఎంతోకాలం నుంచి ఊబకాయం ఉన్నా, ఇటీవలి కాలంలో అది బాగా పెరిగిపోతుండడమే ఆందోళనకరం. వాటికి మూలకారణం కూడా మన జీవనశైలే. కడుపునిండా తినడం, కష్టించి పనిచేయడం, కంటినిండా నిద్రపోవడం వంటివి మంచి ఆరోగ్యానికి బాటలు వేస్తాయని మన పూర్వీకులు అనుభవంతో చెప్పిన మాటలను ఎవరూ ఇప్పుడు పట్టించుకోవడం లేదు. శరీరానికి తగినంత వ్యాయామం లేకపోవడం, శుభ్రత-నాణ్యత లేకున్నా ప్యాకెట్లలో వచ్చే ఆహారపదార్ధాలు, రోడ్లమీద బండ్లమీద కనిపించే పదార్ధాలు ఏదంటే అది తినేయడం వంటివన్నీ ఊబకాయం వంటి ప్రమాదకరమైన సమస్యలు రావడానికి దారితీస్తున్నాయి. అంతేకాదు, పాశ్చాత్యపుటలవాట్ల మోజులో పడి..జంక్‌ఫుడ్స్, పిజ్జాలు, బర్గర్లు వంటివన్నీ తినేస్తున్నాం. బేకరీ ఉత్పత్తులు, రంగురంగుల రసాయనాలతో కలిపిన రకరకాల కలుషిత పానీయాలు, అత్యధికంగా తీపి పదార్ధాలు, శీతల పానీయాలు వంటివెన్నో మన ఆరోగ్యాన్ని నాశనం చేసేందుకు చుట్టుముట్టి ఉన్నాయి. అందుకు తగ్గట్లుగా పనివత్తిడులు, మానసిక సమస్యలు. ఇక మనం వాటినుంచి బయటపడేదెప్పుడు?.. సరిగ్గా ఇలాంటి దుస్థితే అలాంటి వ్యాధులకు కారణమవుతోంది. శరీరం తేలికగా, లేదా చలాకీగా ఉంటేనే ఉత్సాహంగా ఉంటుంది. అధికబరువుతో కదలలేక, మెదలలేక..చిన్నగా అడుగులు వేస్తూ ఉండడం వల్ల జీవితంలో నిరాసక్తత కూడా అధికమవుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే అధికబరువుతో అన్నీ బాధలే. ఊబకాయం..నరకప్రాయమే!.. ఇకనైనా ఇలాంటి అనారోగ్య బాధల నుంచి మనం బయటపడాల్సి ఉంది. దేశంలో తీవ్రమవుతున్న ఈ దుస్థితినంతా గమనించే ఇటీవల ప్రధాని మోడీ 'మన్ కీ బాత్' ప్రసంగంలో ప్రధానంగా ఊబకాయం గురించి ప్రస్తావించారు. దీనిపై మనమంతా పోరాటం చేయాల్సి ఉందని కూడా స్పష్టం చేశారు. అంతేకాదు, ఊబకాయంపై పోరాటాన్ని బలోపేతం చేయడానికి జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రితో పాటు 10 మంది ప్రముఖులను కూడా ప్రధాని నామినేట్ చేయడం హర్షదాయకం. ఏదేమైనా, ఊబకాయం వంటి దీర్ఘకాలిక వ్యాధులను కూడా ప్రజలు అవగాహన చేసుకుని, ఆ వ్యాధులు తమదాకా రాకుండా జాగ్రత్తపడాలి. సరైన జీవనశైలి, మంచి అలవాట్ల ద్వారా మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవాలి. 'ఆరోగ్యమే మహాభాగ్యం' అని మన పెద్దలు అందుకే అన్నారు. ఇకనైనా మన జీవనశైలి మారాలి. ఒక్క ఊబకాయం వ్యాధికే కాదు, ఎలాంటి వ్యాధులూ మనల్ని భయపెట్టకుండా ఆరోగ్యంపై దృష్టి సారించాలి. పౌష్టికాహారంతో, వ్యాధినిరోధక శక్తిని పెంపొందించుకుంటూ మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవాలి. తద్వారా.. భావితరం వారు కూడా ఆరోగ్యకరంగా ఉండేలా ఇప్పటినుంచే జాగ్రత్తపడాలి..!

# బ్యారికేడ్లు పెట్టి, పరదాలు కట్టి, చెట్లు కొట్టాలా?

మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత పులివెందుల శాసనసభ్యుడు వై.ఎస్.జగన్ భద్రతపై వైసీపీ నాయకుల ఆందోళనలు, ప్రకటనలు వింతగా ఉంటున్నాయి. జగన్ ముఖ్యమంత్రిగా అధికారం వెలగబెట్టిన ఐదేళ్లూ రాష్ట్రంలో ఎక్కడా ఒక్క చెట్టు కూడా లేకుండా చేశాడు. సీఎం హోదాలో తాను ఎక్కడ పర్యటిస్తే.. అక్కడ బ్యారికేడ్లతో ఇనప గోడలు కట్టించాడు. చుట్టూ పరదాలు ఏర్పాటు చేయించాడు. ఇవన్నీ కాకుండా పచ్చని చెట్లని నిర్దాక్షిణ్యంగా నరికించి నిలువ నీడ కూడ లేకుండా చేశాడు. తాను పర్యటనకి వచ్చే ప్రాంతాలలో వ్యాపారాలన్నీ మూయించేసి వ్యాపారుల నోట్లో మట్టి కొట్టాడు. జగన్‌రెడ్డి వస్తున్నాడంటేనే జనం హడలిచచ్చేలా ఆ ఐదేళ్ళూ జనాన్ని భయభ్రాంతులకు గురిచేశాడు. అలాంటి జగన్‌మోహన్‌రెడ్డికి ఇప్పుడు కూడా అదే తరహా భద్రత కల్పించాలని బొత్స లాంటి సీనియర్ నాయకులు కూడా కోరడం హాస్యాస్పదం. సిగ్గు చేటైన విషయం.

**ఎల్.కోటిరెడ్డి, ఒంగోలు.**

## దేశంలోని అన్ని ప్రముఖ దేవాలయాలలో..
# టీటీడీ తరహాలో నియంత్రణ వ్యవస్థలు రావాలి!

అంతర్జాతీయ ఆలయాల సదస్సులో నెల్లూరు జిల్లాలోని జొన్నవాడ దేవాలయానికి గుర్తింపు రావడం ఆనందదాయకం, శుభకరం. అన్ని ఆలయాలలో ఆగమ విధులు పరిరక్షించబడేలా చర్యలు చేపట్టాలి. దేవాలయాల పరిసరాలలో ఆధ్యాత్మికత ప్రతిబింబింపబడేలా చూడాలి. తిరుమల తిరుపతి దేవస్థానాల తరహాలో నియంత్రణ వ్యవస్థలు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఏర్పాటు కావాలి.

అలాగే, వాల్మీకి రామాయణాన్ని ఆడియో రూపంలో తీసుకొచ్చే ప్రయత్నం అభినందదాయకం. ఆ మహత్కార్యానికి శ్రీకారం చుట్టి ఆవిష్కరించిన అవధాని కోట రాజశేఖర్‌కి నా అభినందనలు.

**సి. ఆర్. విశ్వేశ్వరరావు - మాజీ ఉపకులపతి, హైదరాబాదు.**

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

# గుళ్ళలో రాజకీయాలు నిషేధించాలి!

రాజకీయ నాయకులు తమ రాజకీయ ప్రచారాల, ప్రాభావాల కోసం దేవస్థానాలని వేదికలుగా చేసుకోవడం విచారకరం. తిరుమల, శ్రీశైలం, భద్రాచలం, శ్రీకాళహస్తి, కాణిపాకం వంటి దేవాలయాలతో పాటు ఇతర ప్రముఖ ఆలయాలలో రాజకీయ నాయకుల జోక్యం లేకుండా చట్టం తేవాలి. ప్రత్యేక దినాలు, బ్రహ్మోత్సవాలు, పండుగ రోజులలో రాజకీయ నాయకుల హడావుడి ఎక్కువగా కనిపిస్తోంది. దేవస్థానాలలో జోక్యాన్ని దేవాదాయ శాఖ వరకే పరిమితం చేస్తే బాగుంటుంది. హిందుత్వ ప్రతినిధి పార్టీగా ముద్ర వేసుకున్న భారతీయ జనతా పార్టీతో మిత్రపక్షాలుగా పనిచేస్తున్న టీడీపీ, జనసేన పార్టీలు దేవాలయాలలో రాజకీయాలు నిషేధించేలా అడుగులు వేయాలి. ఇలాంటి విప్లవాత్మక చర్యలు ఆంధ్రప్రదేశ్ నుండే మొదలుపెట్టి ఇతర రాష్ట్రాలకి ఆదర్శంగా నిలవాలి.

**లక్ష్మీ భరద్వాజ్, హైదరాబాదు.**




# కానరాని అడవుల పరిరక్షణ... జంతు సంరక్షణ!

ప్రకృతికి, పచ్చదనానికి నిలయం మన భారతదేశం. సుమారు 7.13 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణపు అడవులకి నెలవుగా భారత ఖండం ప్రసిద్ధి. ఇవి దేశ భౌగోళిక విస్తీర్ణంలో 21.7 శాతం వరకు ఉన్నట్లు గణాంకాలు చెప్తున్నాయి. ఇంతటి భారీస్థాయిలో అటవీ ప్రాంతాలు ఉండడం మనదేశానికో వరం. ఈ విశాల అడవులలో సుమారు 90వేల జాతుల జంతువులు, 2000 రకాలకిపైగా పక్షులు కొలువై ఉన్నాయని పరిశోధకులు చెప్తున్నారు. ఇన్ని రకాల జీవరాశులకు జీవనాధారమైన అడవులను మనం కాపాడుకోగలుగుతున్నామా...? అంటే అనుమానమే. జంతువులు, పక్షులతో పాటు అడవులని ఆధారం చేసుకుని జీవిస్తున్న వన్యప్రాణులని మనం రక్షించుకోగలుగుతున్నామా..? అన్నది ప్రశ్నార్ధకమే. ఇది అత్యంత బాధాకరం. మనకి సహజంగా లభించిన అడవి సంపదని, దానిని ఆధారం చేసుకుని జీవిస్తున్న జీవరాశులని మనం పరిరక్షించుకోలేకపోవడం మన ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనం.

### మానవుడు కూడా ప్రకృతిలో భాగమే..!

వాస్తవానికి.. అనంతమైన ఈ ప్రకృతిలో మనిషితోపాటు జీవరాశులెన్నో ఉన్నాయి. మనిషి కూడా అందులో అంతర్భాగం. అయితే, మానవుడు తన మేధాశక్తితో అన్నిటినీ జయిస్తున్నాడు. జంతుప్రపంచాన్ని కూడా తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. ఆ అహంభావంతోనే చివరికి తన ఉనికికి పట్టుగొమ్మ అయిన ప్రకృతిని, జీవవైవిధ్యానికి దోహదం చేసే జంతుజాలాన్ని చేజేతులా నాశనం చేస్తున్నాడు. మనిషి దురాశకు జంతుజాలం కూడా క్రమేణా కనుమరుగైపోతోందన్నది నిర్వివాదాంశం. ఒక్క మనదేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఈ దుస్థితి ఉంది. మనిషి తన స్వార్ధం కోసం అడవులను నరికేయడం, ధనార్జన కోసం జంతువులను వేటాడి వధించడం సర్వసాధారణమైపోయింది.

### అటవీప్రాంతాల్లో ఆగని జంతువధ

దేశంలోని అన్ని రాష్ట్రాలు.. అన్ని జిల్లాల్లో అటవీప్రాంతాలు విస్తరించి ఉన్నాయి. వాటిలో ఉన్న జంతు జీవాలని కొన్ని ప్రాంతాల్లో బహిరంగంగాను, మరికొన్ని చోట్ల చాటుమాటుగానూ వేటాడే మానవమృగాలు ఎక్కువైపోయారు. దీని కారణంగా వాటి సంఖ్య క్రమేణా తగ్గిపోవడమే కాక, పర్యావరణానికి కూడా ముప్పు వాటిల్లుతుందని ప్రకృతిప్రియులు, జంతు ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. జంతువులను పైశాచిక పద్ధతుల్లో వేటాడే కిరాతక ముఠాలకు, ప్రకృతి సంపదను విచ్చలవిడిగా దోచుకుపోయే అడవి దొంగలకు మనదేశంలో కొదవేలేదు. పైగా అలా అటవీ సంపదని కొల్లగొట్టే వారిని హీరోలుగా చూపిస్తూ దర్శక నిర్మాతలు "పుష్ప" లాంటి సినిమాలు నిర్మిస్తే, వెర్రి జనం వాటిని ఆదరించి హారతులిస్తున్నారు. కలక్షన్ల రూపంలో కోట్లు కుమ్మరిస్తున్నారు.

కొన్ని అటవీప్రాంతాల్లో అసంఖ్యాకంగా ఉన్న కుందేళ్లు, దుప్పులు, జింకలు, దున్నలు, అడవి ఆవులు, గేదెలు వంటి మూగజీవాలు వేటగాళ్ళ ఇనుప ఉచ్చులకు తగులుకుని అత్యంత దారుణంగా ప్రాణాలు కోల్పోతున్నాయి. ఒకవైపు క్రూరజంతువుల కోరలకు చిక్కి కొన్నిరకాల జంతువులు హరించుకుపోతుంటే, ఇంకొన్ని కరువులు, విపరీతమైన ఎండలు వంటి ప్రకృతి విపత్తుల వల్ల మరణిస్తుంటే, మరికొన్ని మానవుడి దురాశకు, ధనార్జనకు బలైపోతున్నాయి. అనేక అరుదైన జాతులకు చెందిన జంతువులు, పక్షులు కూడా మానవుడి మారణకాండ కారణంగా క్రమేణా కనుమరుగైపోతున్నాయి. ప్రభుత్వాలు అటవీ సంరక్షణచట్టం, పర్యావరణ పరిరక్షణ చట్టం, జీవవైవిధ్య చట్టం వంటి ఎన్ని కట్టుదిట్టమైన చట్టాలు తెచ్చినా అవి కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఆచరణలో అవి సాధ్యం కావడంలేదు. అక్రమార్కులు ఎప్పటికప్పుడు దొంగదారులు తెరుస్తూనే ఉన్నారు. దీంతో అనేక అటవీప్రాంతాల్లో జంతువధ, వాటి అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదంటూ జంతుప్రేమికులు విమర్శిస్తున్నారు.

### వేసవిలో దాహార్తితో జంతువుల విలవిల

వానలు అంతంతమాత్రంగానే ఉండే నేటి కాలంలో, ఎక్కడ చూసినా ఎండవేడిమి భగభగలాడిపోతోంది. ఎండాకాలం వస్తే చాలు.. అడవుల్లో జంతువులకు కానికాలం వచ్చేసినట్లే. కొండకోనల్లోని జలపాతాలు ఆవిరైపోయి, కాలువల్లో నీరెండిపోయి, గుక్కెడు నీటి కోసం అవి పడే బాధలు వర్ణనాతీతం. అడవుల్లో ఉన్న కొన్ని వేలరకాల జంతువులు, పక్షులతోపాటు అనేక వన్యప్రాణులు ఈ మండేఎండల్లో దాహార్తితో విలవిల్లాడుతుంటాయి. నోళ్లు పిడచకట్టుకుపోయి, ఎక్కడ నీటిచుక్క దొరుకుతుందా అని వెతుక్కుంటూ అడవులను వదిలేసి కొన్నిచోట్ల జనావాసాలకు కూడా వచ్చేస్తుంటాయి.

దాహంతో, ఆకలితో అవి పరుగెత్తలేని దయనీయ స్థితిలోకి వెళ్ళి, ఇతర జంతువుల దాడికి గురై కూడా కొన్ని మృత్యువాత పడుతున్న సంఘటనలు కోకొల్లలు. ఇలాంటి పరిస్థితుల్లో మానవత్వం ఉన్న మానవులుగా మనం వాటి ప్రాణాలను నిలబెట్టేందుకు చేతన్నైనంత సాయం చేయాలే తప్ప, చేతలుడిగి కూర్చుంటే ఇక వాటికి దిక్కెవరు?

### ప్రభుత్వాలు పటిష్ట చర్యలు చేపట్టాలి..!

అటవీ అధికారులు, పెద్దసంఖ్యలో ఉన్న అటవీ సిబ్బంది అడవుల్లో జంతువుల ప్రాణాలు కాపాడేందుకు, వాటి దాహార్తి తీర్చేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలి. వీల్కైన చోట్ల నీటితొట్లను ఏర్పాటుచేసి వాటికి నీరందించే ఏర్పాట్లు చేస్తే కొంతలో కొంతైనా ఉపయోగం ఉంటుంది. కొన్ని రాష్ట్రాల్లో ఇలాంటి చర్యలు తీసుకుంటున్నారు కానీ, అవింకా విస్తృతం కావాల్సి ఉంది. అందులోనూ, ఈ వేసవిలో అడవులకు అగ్నిప్రమాదాల ముప్పు కూడా ఉంటుంది. వేడిమికి అగ్ని రాజుకోవడం, లేదా నిప్పురవ్వలు పడి, అవి చివరికి కార్చిచులా మారిపోతుండడం, తద్వారా అడవిలోని పచ్చనిచెట్లు కూడా అగ్నికి ఆహుతికావడం నిత్యకృత్యమైపోయింది. ఇలాంటి సంఘటనలలో అధిక సంఖ్యలో జంతువుల ప్రాణాలు బలైపోతున్నాయి. ఇలాంటి ప్రమాదాలను నివారించేందుకు అటవీదారుల్లో గస్తీని మరింతగా ముమ్మరం చేయడమే కాక, వీలైన చోట్లంతా నిఘా కెమెరాల పర్యవేక్షణలో అడవుల భద్రతను పరిరక్షిస్తుండాలి. ఏదేమైనా, జంతువుల పట్ల జనం జాలి, దయ కలిగివుండాలి. వాటి రక్షణకు అందరూ చిత్తశుద్ధితో కృషిచేయాలి. ప్రభుత్వాలు, అటవీ అధికారులతో పాటు, అటవీ ప్రాంతాల్లోని ప్రజలు కూడా అందుకు పూర్తిస్థాయిలో సహకారం అందించాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు చేపట్టాలి..!

**- రాజశ్రీ**

# ఇస్తిమా విజయవంతం

## సహకరించిన విపిఆర్ దంపతులకు ధన్యవాదాలు

**—సంస్థ కార్యదర్శి నిజాముద్దీన్**



కొడవలూరు మండలంలోని చంద్రశేఖరపురం వద్ద ఇటీవల ఎంతో ఘనంగా రెండు రోజులు నిర్వహించిన తబ్లిగ్ ఎ జమాత్ రాష్ట స్థాయి ఇస్తిమా విజయవంతం కావడంపై ఇస్తిమా నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. ఇస్తిమా విజయవంతంలో ప్రధాన పాత్ర వహించిన వేమిరెడ్డి దంపతులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆ మేరకు సోమవారం ఆ సంస్థ జిల్లా కార్యదర్శి నిజాముద్దీన్ విలేకర్లతో మాట్లాడుతూ, విపిఆర్ ఫౌండేషన్ సేవలను కొనియాడారు. రాష్ట్రం నలుమూలలల నుంచి లక్షకుపైగా భక్తులు హాజరైనా.. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిల సహాయ సహకారాలతో వారికి అన్నివిధాలైన మౌలికవసతులు కల్పించామని చెప్పారు. విద్యుత్, పోలీసు అధికారులతో మాట్లాడి ఇస్తిమా నిర్వహణకు అనుమతులు ఇప్పించడమే కాకుండా. ఇస్తిమా నిర్వహించే గ్రౌండ్ క్లియరెన్స్ కోసం జెసిబి మొదలు, స్నానపానాదులకు కోసం 20కి పైగా వాటర్ ట్యాంకర్లతో నిరంతరం నీటి సరఫరా చేశారని, 2 లక్షలకుపైగా వాటర్ బాటిళ్లు అందజేశారని తెలిపారు. విపిఆర్ దంపతులకు అల్లాహ్ దీవెనలు ఎప్పుడూ ఉంటాయని ఆయన అన్నారు. అనంతరం రాష్ట టీడీపీ మైనారిటి సెల్ కార్యదర్శి మహమ్మద్ జాకీర్ షరీఫ్ మాట్లాడుతూ ఇస్తిమా నిర్వహణ విషయంలో సౌకర్యాల కల్పనకు సంబంధించి తాము ఏమడిగినా కానదకుండా లేదనకుండా వేమిరెడ్డి దంపతులు సమకూర్చారని గుర్తు చేశారు. దాదాపు 25ఎకరాల విస్తీర్ణం గల ఇస్తిమా గ్రౌండ్‌లో సిసి కెమెరాలు, లక్షలాది వాటర్ బాటిళ్లు, భక్తుల కోసం మొబైల్ టాయిలెట్స్ సమకూర్చి ఇస్తిమా విజయవంతం కావడానికి కృషిచేసిన ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిలకు ఆయన ముస్లింల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. ఇస్తిమా విజయవంతంలో వేమిరెడ్డి దంపతుల పాత్ర వెలకట్టలేనిదని చెప్పారు. అలాగే మంత్రి నారాయణ, వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్‌ల సహకారంతో ఇస్తిమాను విజయవంతంగా నిర్వహించగలిగామని చెప్పారు. తెలుగుదేశం నెల్లూరు నగర టీడీపీ నాయకులు ఎస్‌ఆర్ ఇంతియాజ్ మాట్లాడుతూ, ఈ ధార్మిక కార్యక్రమంలో వేమిరెడ్డి దంపతులను భాగస్వాములను చేసి విపిఆర్ ఫౌండేషన్ ద్వారా సేవలు అందేలా సహకరించిన ఘనత రాష్ట వక్ఫ్‌బోర్డు అధ్యక్షులు అబ్దుల్ అజీజ్‌కే దక్కిందన్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు నెల్లూరు నగర పాలక సిబ్బందిని కేటాయించిన మంత్రి పొంగూరు నారాయణకు, ఇస్తిమాకు అన్నీ తామై నడిపిన విపిఆర్ దంపతులకు ఇంతియాజ్ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా టిడిపి అధికార ప్రతినిధి సాబీర్ ఖాన్, నాయకులు సయ్యద్ నౌషాద్, కొడవలూరు మండల టీడీపీ నాయకులు సతీష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 'రాళ్లపల్లి' వారింట..

# '60 వసంతాల పెళ్లివేడుక'



నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో సుమారు పాతికేళ్లపాటు పనిచేసి, ఆ తర్వాత వెంకటగిరి, దగదర్తిలలో ఎంఆర్ఓగా కూడా నిబద్ధతతో, నిజాయితీతో విధులు నిర్వహించి, 2000వ సంవత్సరంలో రిటైరై నెల్లూరులోని తమ నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ప్రముఖ సాహితీవేత్త రాళ్లపల్లి రామసుబ్బారావుకు ఇప్పుడు 83 సంవత్సరాలు. ప్రముఖ సంగీత విద్వాంసురాలు.. దూరదర్శన్-ఆకాశవాణి గాయని శ్రీమతి రాళ్లపలి సుబ్బలక్ష్మి ఆయన ధర్మపత్ని. వీరి వివాహం జరిగి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఫిబ్రవరి 21న వారింట '60 వసంతాల వివాహ మహోత్సవం' కన్నులపండువగా జరిగింది. వారి కుమారులు ఫణీంద్ర, ఉపేంద్రల సారధ్యంలో, కుమార్తెలు గాయత్రి-శర్వాణిలు అమ్మానాన్నలను పూజించుకుని, తల్లితండ్రుల ఆశీస్సులందుకున్నారు. ఇరుగుపొరుగు వారంతా వచ్చి దీవెనలందించారు. ఈ సందర్భంగా, మహాశివునికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ పూజలు, వేడుకలన్నీ నేత్రపర్వంగా జరిగాయి.

# దొడ్ల కుటుంబానికి కీర్తి.. మహమ్మదాపురం పాఠశాల!

## • మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానంటున్న కలెక్టర్





జిల్లాలో దొడ్ల కుటుంబం వారంటే తెలియనివారుండరు. తమ దాతృత్వంతో జిల్లాలో ఎన్నో ప్రజోపయోగ కార్యక్రమాలకు చేయూతనిచ్చి, నిస్వార్ధ సేవాభావానికి ప్రతీకలుగా నిలిచిన దొడ్ల కుటుంబం వారి దానగుణం జిల్లా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయే ఉంది. ప్రత్యేకించి విద్య-వైద్య రంగాల్లో వారి సేవలు ఎంతో అపూర్వమైనవి. అందులో భాగంగా, విద్యాపరంగా ఆ మహాదాతలు గ్రామీణప్రాంతాల్లోని పేద విద్యార్థులకు అందుబాటులో ఉండేవిధంగా వారు నెలకొల్పిన సరస్వతీ నిలయమే.. మహమ్మదాపురం ఉన్నత పాఠశాల. ఇది దొడ్ల కుటుంబం వారి ఘనకీర్తిని మరింతగా చాటుతోంది. ఆ దాతల పుణ్యామా అని ఆ హైస్కూల్ విశాల ప్రాంగణం, భవనాలతో, విద్యార్థులకు అన్ని మౌలిక వసతులతో అలరారుతోంది. ఈ నేపథ్యంలో, ఆ హైస్కూల్‌ను జిల్లా కలెక్టర్ ఆనంద్ సందర్శించడం, త్వరలోనే మోడల్ స్కూల్‌గా రూపుదిద్దేందుకు కృషిచేస్తామని చెప్పడంతో గ్రామస్తుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. దీంతో, ఆ స్కూల్‌కు రానున్న రెండేళ్ళలో మరింత వైభవం రానుందని భావిస్తున్నారు. తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్)లో భాగంగా నిర్మించిన దొడ్ల శంకరమ్మ హాస్టల్ బ్లాక్‌ను నిర్మాణ దాతలు దొడ్ల శేషారెడ్డి ఈనెల 25న కలెక్టర్ సమక్షంలో దానిని ప్రభుత్వానికి అప్పగించగా, హాస్టల్ గదులను, పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, దొడ్ల కుటుంబం వారి సేవలు అపారమని కొనియాడారు. దీనిని జిల్లాలోనే ఒక ఆదర్శ పాఠశాలగా రూపుదిద్దుతామని హామీ ఇస్తూ, అందుకు అందరూ సహకరించాలన్నారు. హాస్టల్, పక్కనే వున్న జడ్పీ హైస్కూల్, ఎస్సీ-బీసీ వసతి గృహాలను ఒక మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధిచేసి మోడల్‌స్కూల్‌గా తయారుచేసేందుకు ప్రయత్నిస్తానని కలెక్టర్ చెప్పారు. అంతేకాదు, ఆ హైస్కూల్‌లో ఆధునాతన కంప్యూటర్ ల్యాబ్స్, విశాలమైన క్రీడా మైదానంలో వాలీబాల్, క్రికెట్, బాస్కెట్‌బాల్ కోర్టులు, మోడల్ కిచెన్ వంటి అత్యాధునిక వసతులను విద్యార్థులకు అందుబాటులో ఉంచేందుకు కూడా ఒక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. దాతలు, గ్రామస్తులు, ఉన్నత ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరూ తమ వంతు ప్రయత్నంగా పాఠశాల అభివృద్ధికి ముందుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. అందుకు ప్రభుత్వ పరంగా కూడా తాము తగు ఏర్పాట్లు చేస్తామన్నారు.

### కలెక్టర్ సహకారం..సంతోషదాయకం

**దొడ్ల డెయిరీ ఛైర్మెన్ దొడ్ల శేషారెడ్డి**

విద్యార్థులకు ఏదైనా మేలుచేయాలనే తపనవున్న కలెక్టర్ మన జిల్లాకు రావడం అదృష్టమని, ఈ పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తామనడం సంతోషదాయకమని ఈ కార్యక్రమంలో పాల్గొన్న దొడ్ల డెయిరీ ఛైర్మెన్ దొడ్ల శేషారెడ్డి హర్షం ప్రకటించారు. దొడ్ల శంకరమ్మ పేరుతో హాస్టల్ భవనాన్ని నిర్మించి కలెక్టర్‌కు అప్పజెప్పడం చాలా సంతోషంగా వుందన్నారు. కలెక్టర్ సహాయ సహకారాలతో పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి ఉంటుందన్నారు. తొలుత పాఠశాలకు విచ్చేసిన కలెక్టర్‌కు దొడ్ల కుటుంబసభ్యులు, హాస్టల్ భవన నిర్మాణ దాతలు.. దొడ్ల డెయిరీ ఛైర్మెన్ దొడ్ల శేషారెడ్డి, దొడ్ల డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ దొడ్ల సునీల్‌రెడ్డి, దొడ్ల సుబ్బారెడ్డి, జిల్లా బీసీ,ఎస్సి సంక్షేమశాఖ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మామిడిపూడిలో..

# 'ప్రకృతి' ఫౌండేషన్ సేవ

మనం ఇంగ్లీషు మందులకు అలవాటుపడిపోయాం కానీ, నిజానికి ఆయుర్వేదం, ప్రకృతి వైద్యం వంటివి ఆరోగ్యానికి ఎంతో మేలు. పాతకాలం నుంచి ఉన్న వైద్యం ఇది. ఒక్కోసారి ఇంగ్లీషు మందులు వికటిస్తుంటాయి కానీ ఆయుర్వేదం మందుల వల్ల అలాంటి బాధలు ఏమీ ఉండవు. ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్స్ ఉండవు. అనేక రకాల రోగాలకు ఆయుర్వేదంలో సరైన మందులున్నాయి. అన్నివిధాలా మేలైన ఆయుర్వేద వైద్యాన్ని ప్రభుత్వాలు కూడా ప్రోత్సహిస్తున్నాయి. పట్నవాసాల్లో వాటిని పట్టించుకునేవారు తక్కువ కానీ, గ్రామాల్లో ప్రజలకు మాత్రం మంచి నమ్మకం. అయితే, ఆయుర్వేదంపై ప్రజలకు ఇంకా అవగాహన పెరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో, ఈనెల23న ముత్తుకూరు మండలం మామిడిపూడి గ్రామంలో 'ప్రకృతి' సేవా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రకృతి వైద్యం, ఆయుర్వేద వైద్యం వల్ల ఎలాంటి ఉపయోగాలున్నాయో ప్రజలకు తెలియజెప్పారు. వనమూలికలతో దీర్ఘకాల వ్యాధులను కూడా నయం చేసుకోవచ్చని ఆ సేవా ఫౌండేషన్ ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ వెంకటగిరీష్ కుమార్ వివరించారు. శిబిరానికి వచ్చినవారికి ఆరోగ్యపరీక్షలు చేసి, 50శాతం రాయితీతో ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. ప్రజలు ఇలాంటి మందులను వాడుకుంటే మంచిది కదా!...

# ముత్తుకూరులో సీసీ కెమెరాల నిఘా

సముద్రతీరప్రాంతమైన ముత్తుకూరులో ఎలాంటి నేరాలు జరగకుండా జిల్లా పోలీసుయంత్రాంగం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. ఈనెల 25న జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో ముత్తుకూరులో 32 లొకేషన్‌లతో అనుసంధానిస్తూ 55 సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. ముత్తుకూరు పోలీస్‌స్టేషన్‌లో అందుకు సంబంధించిన విభాగాన్ని ప్రారంభించారు.

# ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్‌పో



నెల్లూరులోని శ్రీ నేతాజీ ఎంఎస్:ఆర్ పైలట్ హైస్కూల్‌లో ఈనెల 24న మ్యాథ్స్-సైన్స్ ఎక్స్‌పో-2025 నిర్వహించారు. హైస్కూల్ కరెస్పాండెంట్ ఎంవి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గన్నారు. ప్లేక్లాసు నుండి 9వ తరగతి చదివే పిల్లలవరకు పాల్గొని, తమ నైపుణ్యంతో పలు ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించారు. విద్యార్థినీ విద్యార్థులు సుమారు 635 ప్రాజెక్టులను ప్రదర్శించడం విశేషం. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ నెల్లూరు జోనల్ ఛైర్మెన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మెన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, అపస్మా రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్‌వి రమణారెడ్డి, జిల్లా కార్యదర్శి ఎస్ రామమోహన్‌రెడ్డి, కోశాధికారి పీవీ కృష్ణారావు, హైస్కూలు సీనియర్ డైరెక్టర్ కె.నరేంద్రరెడ్డి, పాఠశాల డైరెక్టర్ డా. సుబ్రామ్ పాల్గొని విద్యార్థుల ప్రతిభాపాటవాలను అభినందించారు. నేతాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు వేదవతి సుబ్బారెడ్డి, డైరెక్టర్ డా. అలేఖ్య, హెడ్‌మాస్టర్ ఎస్‌విఎల్ నరసింహారావు, ప్రిన్సిపాల్ సుధ, వైస్ ప్రిన్సిపాల్ కె. స్పందన, ఏఓ ఆర్ చెంచయ్య, అకడమిక్ కోఆర్డినేటర్ ఎం.రమాదేవి, పీఇటీలు రమేష్, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# సామాన్య భక్తులకి పెద్దపీట - మంత్రి ఆనం



రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలలో సామాన్య భక్తులకి పెద్దపీటవేసి, వారందరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆ పరమశివుని దర్శనం కలిగే విధంగా అధికారులు, పాలక వర్గాలు దర్శన ఏర్పాట్లు చేశారని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మంత్రి నెల్లూరులోని ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీ మూలస్థానేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, శాంతి, సౌభాగ్యాల కోసం ఆ భగవంతుని ప్రార్థించారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ, మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్రంలో ఉన్న దాదాపు 30 ప్రఖ్యాత శైవక్షేత్రాల్లో శివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసిందన్నారు. రాష్ట్రంలో ప్రతి ఆలయంలో భక్తి భావం వెల్లువెత్తుతోందన్నారు. కాలి నడకన కూడా లక్షలాది మంది భక్తులు కొండలు ఎక్కి దైవ దర్శనం కోసం వస్తున్నారన్నారు. శ్రీశైలం, శ్రీకాళహస్తి, కోటప్పకొండ క్షేత్రాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆ పరమేశ్వరునికి పట్టు వస్త్రాలను సమర్పించి నేత్రపర్వంగా వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, రాష్ట్ర ప్రజలందరికీ, ఆ పరమశివుని ఆశీస్సులు మెండుగా ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆ మహాదేవుడిని ప్రార్థించినట్లు మంత్రి చెప్పారు.

# బీద రవిచంద్ర కొడుకు పెళ్ళిలో.. సీఎం సందడి!



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 23న నెల్లూరుకి విచ్చేశారు. నెల్లూరు వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన బీద రవిచంద్ర కుమారుడి పెళ్లి వేడుకలో పాల్గొనడం కోసం ఆయన ప్రత్యేక హెలికాప్టర్లో నెల్లూరుకి వచ్చారు. ఈ పెళ్ళి వేడుకలో ప్రధానఅతిథిగా పాల్గొని సందడి చేశారు. వధూవరులని అభినందించి ఆశీర్వదించి వెళ్ళిపోయారు.

వివరాలలోకి వెళ్తే... తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకుడు, నెల్లూరుజిల్లా ప్రజలకి సుపరిచితుడు బీద రవిచంద్ర – శ్రీమతి జ్యోతిల కుమారుడు గోకుల్ రిష్వంత్ – దివిజల వివాహం ఫిబ్రవరి 23వ తేదీ అంగరంగ వైభవంగా జరిగింది. ఈ శుభవేడుకలో ముఖ్యమంత్రితో పాటు అనేకమంది రాజకీయ, పారిశ్రామిక, అధికార, అనధికార ప్రముఖులు, ఇరు కుటుంబాల బంధుమిత్రులు, బీద కుటుంబ అభిమానులు విశేషంగా పాల్గొని కొత్త జంటకి తమ దీవెనలు అందించారు. నవ దంపతులకి 'లాయర్' అభినందనలు.

## నెల్లూరు కబుర్లు

## రైతులకు మేలుచేసే ప్రభుత్వం



తమది రైతులకు మేలుచేసే ప్రభుత్వమని, రైతు పండించిన ప్రతి గింజ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఇటీవల నెల్లూరు కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన సమావేశంలో ఆయన అధికారులు, రైస్‌మిల్లర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అధికారులందరూ రాబోయే రెండు నెలలు కష్టపడి పనిచేసి రైతాంగానికి మేలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈకేవైసి వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులకు నమ్మకం కలిగించే విధంగా 24 గంటల్లోగా కొనుగోళ్ళు చెల్లింపులు పూర్తి చేస్తున్నామని, అందుకోసం జిల్లాలో 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేస్తామని తెలిపారు. పారదర్శకంగా కొనుగోళ్ల ప్రక్రియ పూర్తిచేస్తామని, రైతులు ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదన్నారు. ఈ సమావేశంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పౌర సరఫరాల డైరెక్టర్ పట్టాభిరామిరెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఛైర్మెన్ రంగయ్యనాయుడు, సోమశిల ప్రాజెక్టు కమిటీ ఛైర్మెన్ కేశవ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతలు చేపట్టిన మల్లికార్జునరెడ్డి



ఇటీవలే ఐటీడీపీ ప్రాజెక్టు అధికారిగా నియమితులైన బి.మల్లికార్జునరెడ్డి ఈనెల 24న నెల్లూరు దర్గామిట్టలోని ఐటీడీపీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గిరిజన సంక్షేమ అధికారిణి పరిమళ, ఏపీఓ రమణయ్య, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## జయభారత్ ఆసుపత్రికి..
# 2లక్షల విరాళం



జయభారత్ హాస్పిటల్‌లో పేదలకు ఉచితంగా 'నేత్ర రక్ష సేవా పథకం" ద్వారా కంటి శుక్లాల ఆపరేషన్ల నిర్వహణకు కీర్తిశేషులు పొన్నలూరు వీరారాఘవరెడ్డి మనుమరాలు శ్రీమతి జక్కా స్వప్నమ్మ జన్మదినం సందర్భంగా శ్రీ రాఘవ చారిటీస్ ఛైర్మెన్ పొన్నలూరు సీతారామిరెడ్డి ఇటీవల లక్ష రూపాయలను విరాళంగా ఇచ్చారు. ఆ చెక్కును జయభారత్ ఆసుపత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్‌కి అందచేశారు. ఈ సందర్భంగా సీతారామిరెడ్డి మాట్లాడుతూ, గతంలో కూడా ఈ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న అనేక సేవా కార్యక్రమాలకు తమ రాఘవ చారిటీస్ ఎంతగానో సహాయసహకారాలు అందించిందని తెలిపారు. పేదలకు నేత్ర శస్త్రచికిత్సల నిర్వహణకు ఈ విరాళం అందించామని, దీని ద్వారా 50మంది పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. ఈ పథకం ద్వారా ఒక ఆపరేషన్‌కు 2వేల రూపాయల వంతున ఖర్చు అవుతుందని, దాతృత్వం కలిగిన పెద్దలు అందుకు సహాయ సహకారాలందించాలని ఆసుపత్రి నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## విలక్షణ కవి.. తెనాలి రామలింగడు



తెనాలి రామలింగ కవి తెలుగు కవే అయినా దక్షిణ భారతదేశ మంతటా ఆయన కథలు ప్రచారంలో ఉన్నాయని, ఉత్తరాదిలో సైతం ఆయన కథలు ప్రసిద్ధి పొందాయని బాలసాహితీవేత్త డా. గంగిశెట్టి శివ కుమార్ చెప్పారు. ఇటీవల స్థానిక చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో, టౌన్‌హాల్‌లోని వర్ధమాన సమాజం హాల్‌లో జరిగిన సాహితీ సభలో ఆయన పాల్గొని తెనాలి రామలింగ కవి వ్యక్తిత్వం.. సాహిత్యం అనే అంశంపై ప్రసంగించారు. రామలింగ కవి ఎంతటివారినైనా తన ప్రతిభా పాండిత్యాలతో చిత్తు చేయగలడని అన్నారు. పద్య కళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, చలంచెర్ల భాస్కరరెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, వై.శేషగిరీశం తదితరులు పాల్గొని డా. గంగిశెట్టిని సన్మానించారు. వీఆర్‌సి విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం సభను నిర్వహించారు. ఏపీయుడబ్ల్యుజె నాయకుడు ఎ.జయప్రకాష్, జి.సుభద్రాదేవి, కవి బొగ్గరపు రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బిందుమీనన్‌కి.. అంతర్జాతీయ పురస్కారం



ప్రముఖ న్యూరాలజీ వైద్యురాలు, నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ న్యూరాలజీ విభాగం అధిపతి డాక్టర్ బిందు మీనన్ ఇటీవల ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. ఢిల్లీలో జరిగిన 15వ ఆసియా మరియు ఓషియానియన్ ఎపిలెప్సీ సదస్సులో ఆ సంస్థ ఛైర్మెన్ జాన్ డబ్ల్యు డునే చేతుల మీదుగా ఆసియా మరియు ఓషియానియన్ అవుట్ స్టాండింగ్ అచీవ్‌మెంట్ ఎపిలెప్సీ అవార్డును డాక్టర్ బిందుమీనన్ అందుకోవడం విశేషం. మూర్ఛ రోగం నివారణకు, వ్యాధిగ్రస్తులకు అవగాహన కలిగించేందుకు ఆమె చేస్తున్న విశేష సేవలను గుర్తించిన ఏఒఇసి సంస్థ ఆమెను ఈ అవార్డుకు ఎంపిక చేసింది.

## విశిష్ట నటుడు.. ఆంజనేయరాజు

- 'కళాంజలి' పురస్కారసభలో వక్తలు



అటు నాటకరంగంలోనూ, ఇటు సినీ, టీవీ రంగాల్లోనూ తనదైన నటనాచాతుర్యంతో అందరినీ మెప్పించి రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో బహుమతులందుకున్న విశిష్ట నటుడు బడబాగ్ని ఆంజనేయరాజు అని వక్తలు కొనియాడారు. ఈనెల 23న నెల్లూరు టౌన్‌హాల్‌లోని ఏసీహాల్‌లో అల్లూరుకు చెందిన విలక్షణ నటుడు.. కేంద్ర సెన్సార్‌బోర్డు మాజీ సభ్యుడైన ఆంజనేయ రాజుకు 'కళాంజలి' సంస్థ ప్రతిభా అవార్డునిచ్చి గౌరవించింది. కళాంజలి అనంత్ సారధ్యంలో జరిగిన ఈ సన్మాన సభలో మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మెన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, వీరిశెట్టి హజరత్‌బాబు, ప్రముఖవైద్యులు జేవీ రామ్మోహన్, నలుబోలు బలరామయ్య నాయుడు, కనగలూరి రమణరావు, జేపీ రావూరి జగన్‌మోహన్, కార్పొరేటర్‌లు బొబ్బల శ్రీనివాస యాదవ్, వాసంతి తదితరులు పాల్గొని నటునిగా, రచయితగా, దర్శకునిగా ఆంజనేయులి ప్రతిభాపాటవాలను ప్రశంసించారు. అనంతరం, కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి–శివప్రియమ్మ దంపతులు ఆంజనేయుల్ని ఘనంగా సన్మానించి, కళాంజలి పురస్కారాన్ని బహూకరించారు. ఈ సభలోనే ప్రముఖ గాయని బివిఎన్ఎస్ జ్ఞానశ్రీ, చిత్రకళలో గిన్నిస్‌బుక్ అవార్డు అందుకున్న సుందరబాబు, 'లాయర్' పత్రిక సబ్‌ఎడిటర్ మద్దూరు శ్రీనివాసులుకు 'కళాంజలి' ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానాలు జరిగాయి. తొలుత, ఆంజనేయులు నటనా జీవిత ప్రస్థానంపై బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆపాత మధురగీతాలతో సభ ప్రారంభమైంది. వ్యాఖ్యాత బెనర్జీ, వీఆర్‌సి విశ్రాంత ప్రిన్సిపాల్ డా. ఎం.సుబ్రహ్మణ్యం, గాయకుడు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.




## శ్రీ కాళహస్తీశ్వరుని సన్నిధిలో..
# ప్రశాంతమ్మ ప్రత్యేక పూజలు



మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యురాలు, కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఈనెల 26న శ్రీ కాళహస్తీశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ఆ ముక్కంటీశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితులు ఆమెకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీకాళహస్తీశ్వర బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మహిళా భక్తులకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పసుపు, కుంకుమ, రవిక, గాజులు, పసుపు దారం అందచేసి తన భక్తిని చాటుకున్నారు. శుభాలు కలిగించే ఆ శంకరుడి అనుగ్రహంతో రాష్ట్రం పాడి పంటలతో సుభిక్షంగా వుండాలని ఆమె ఆకాంక్షించారు. సనాతన సంప్రదాయాన్ని పాటిస్తూ ముక్కంటీశ్వరుడి సన్నిధిలో మహిళా భక్తులకు 'వాయనం' అందచేసిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఔదార్యం పట్ల మహిళా భక్తజనంతో పాటు ఆలయ పాలకవర్గం వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్‌తో పాటు టిడిపి నాయకులు అడపాల అనీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సేవా దినోత్సవంగా.. దేవిరెడ్డి శారద వర్ధంతి

## • 75 మంది దాతలతో రక్తదానం





కీర్తిశేషులు శ్రీమతి దేవిరెడ్డి శారద 8వ వర్ధంతి కార్యక్రమం ఈనెల 26న సేవా దినోత్సవంగా జరిగింది. స్థానిక ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత, డిఎస్ఆర్ ట్రస్ట్ నిర్వాహకులు శారదమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరు మండలం నార్త్‌మోపూరులోని దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో, నెల్లూరులోని ప్రభుత్వ జనరల్‌హాస్పిటల్ బ్లడ్‌బ్యాంక్ వారి సౌజన్యంతో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. విద్యా వైద్యరంగాల్లో పేదలకు డిఎస్ఆర్ ట్రస్టు చేస్తున్న సేవలను ఆదర్శంగా తీసుకుంటూ, అల్లూరు పరిసర ప్రాంతాల నుండి 75 మంది దాతలు పాల్గొని ఈ మెగా రక్తదాన శిబిరంలో రక్తదానం చేయడం విశేషం. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ వి.సుజాత, డా. కట్టా వెంకటేశ్వర్లు, డా. ఆర్.నవీన్, డా. కే.సింధుజ, దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీ దేవిరెడ్డి దశరదరామిరెడ్డి, ట్రస్ట్ అడ్మిన్ మేనేజర్ ఇందుపూరు అనిల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ జెట్టి రమేష్, ప్రిన్సిపాల్ శ్రీలత చౌదరి, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఇన్‌చార్జి బండ్ల రామచంద్రరావు పాల్గొన్నారు.

## డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డికి...
# ప్రతిష్టాత్మక 'టైమ్స్' అవార్డు!



నెల్లూరు నగరంలోని అక్షిత హాస్పిటల్ నిర్వాహకులు, ప్రముఖ జీర్ణకోశ, లివర్, ప్యాన్‌క్రియాజ్ వ్యాధి నిపుణులు (గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్) డాక్టర్ వై.పవన్‌కుమార్‌రెడ్డిని టైమ్స్ ఆఫ్ ఇండియా సంస్థ ప్రతిష్టాత్మక ప్రతిభా పురస్కారంతో సత్కరించింది. దేశ వ్యాప్తంగా వివిధ రంగాల నుండి ప్రతిభావంతులను ఎంపికచేసి గుర్తించడం టైమ్స్ గ్రూప్ ఆనవాయితీగా పెట్టుకుని, గత కొన్ని సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. సంస్థ ఎంపికచేసి సత్కరించేవారిని ఆయా రంగాలలో లీడర్లుగా ప్రకటించి అవార్డుని అందచేస్తుంది. ఈ ఏడాది కూడా ఫిబ్రవరి 16వతేదీ విశాఖపట్టణంలో ఈ అవార్డుల ప్రదాన కార్యక్రమం జరిగింది. వైద్య ఆరోగ్య రంగం నుండి డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డిని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో లీడర్‌గా గుర్తించి అవార్డుని ప్రదానం చేసింది టైమ్స్ సంస్థ. కేంద్ర పౌరవిమానయాన శాఖామంత్రి కింజవరపు రామ్మోహన్‌నాయుడి చేతులమీదుగా పవన్ ఈ అవార్డును అందుకున్నారు. డాక్టర్ పవన్ గత 16 సంవత్సరాలుగా గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో తమ సేవలు అందిస్తున్నారు. ఒక్క నెల్లూరు జిల్లాలోనే కాకుండా సమీప జిల్లాలలో కూడా సమర్ధవంతమైన వైద్యుడిగా, జీర్ణకోశ, లివర్, ప్యాన్‌క్రియాజ్ సమస్యల పరిష్కారానికి మంచి హస్తవాసి కలిగిన నిపుణుడిగా ఖ్యాతి గడించారు. పవన్‌కుమార్‌రెడ్డికి 'లాయర్' అభినందనలు.

# శ్రీసిటీలో.. జాతీయ భద్రతా వారోత్సవాలు



శ్రీసిటీలో ఈనెల 26 నుంచి 54వ జాతీయ భద్రతా వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్‌కామత్ జెండా ఊపి ఉత్సవాలను ప్రారంభించారు. శ్రీసిటీ సిబ్బందికి, స్థానికులకు ఆ కార్యక్రమం ప్రాధాన్యతను వివరించారు. వారిచే భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా, శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో.. పని ప్రదేశాలలో అధికశాతం ప్రమాదాలు అజాగ్రత్త, నిర్లక్ష్యం వల్ల సంభవిస్తాయన్నారు. ప్రమాదాల నివారణకు శ్రీసిటీ, పరిశ్రమలు తరచూ కలసి, తమ ఉద్యోగులు కార్మికులకు అవసరమైన భద్రత పట్ల అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ భద్రతా వారోత్సవాలలో భాగంగా వారం రోజుల పాటు వివిధ అవగాహనా కార్యక్రమాలతో పాటు శ్రీసిటీ ఉద్యోగులు, ఈ ప్రాంతంలోని విద్యార్థులకు వ్యాసరచన, వ్యక్తృత్వ, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించనున్నట్లు శ్రీసిటీ మేనేజర్ (సేఫ్టీ) నరేంద్రబాబు తెలిపారు. మార్చి 4న ముగింపు ఉత్సవం జరుగుతుందన్నారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (ప్రాజెక్ట్స్) ఎన్.శేఖర్, సెక్యూరిటీ–విజిలెన్స్ హెడ్ వై.రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.









## జానకిరామ.. రామాయణం 54

- ఊటుకూరు జానకి రామారావు



మార్గమధ్యంలో మహాకాయంతో ఉన్న ఒక పెద్ద గ్రద్దను రాముడు చూశాడు. అది ఎవరో మాయావి అయిన రాక్షసుడు అని తలచి, నీవు ఎవరు? అని గద్దించాడు.

అప్పుడు ఆ పక్షి చాలా సౌమ్యంగా, మృదువుగా రామా! నేను నీ తండ్రి స్నేహితుడను. నన్ను జటాయువు అంటారు, నా అన్న సంపాతి, మా తండ్రి పేరు అరుణుడు, నీకు ఇష్టమైన ఎడల వనవాసకాలంలో నీకు సహాయకారిగా ఉంటాను అని పలికాడు.

తండ్రి స్నేహితుడు అని తెలుపగానే చాలా ఆనందించి కౌగలించుకొని వారిరువురి స్నేహం గురించి మరల మరల ప్రశ్నించాడు రాముడు.

జటాయువుతో కూడా కలిసి పంచవటిలో ప్రవేశించాడు రాముడు.

అక్కడ లక్ష్మణుని చేతిలో చెయ్యివేసి ఆ ప్రాంతమంతా కలియతిరిగి పర్ణశాల నిర్మించడానికి అనువైన ప్రదేశం నిర్ణయించుకున్నాడు రామచంద్రుడు.

పంచవటి చాలా మనోహరంగా ఉంది.

చుట్టూ పర్వతాలు అందమైన ప్రకృతి ప్రకాశిస్తూ వివిధ వర్ణశోభితమై రమణీయంగా కనపడుతున్నాయి.

ఎటుచూసినా ఎత్తైన చెట్లు. సాల, తాళ, తమాల, పనస, ఆమ్ర, నివార, తిమిస, పున్నాగ, చందన, స్పందన, నీప, పార్ణాస, లికుచ, ధవ, అశ్వకర్ణ, ఖాదిర, సామీ, కిమ్శుక, పాటల వృక్షాలు కనపడుతూ ఉన్నాయి.

అందంగా మెలికలు తిరుగుతూ చక్రవాక పక్షులచేత శోభితమై ఉన్న గోదావరీ నదిని చూడగానే రాముడి మదిలో ఉత్సాహం ఉరకలేసింది.

ఒక చక్కని ఎత్తైన ప్రదేశం ఎంచుకుని లక్ష్మణా ఈ ప్రదేశం చాలా బాగుంది ఇక్కడ పర్ణశాల నిర్మించుకొందాం అని పలికాడు.

వెంటనే లక్ష్మణుడు ఆ ప్రాంతంలో మట్టిని బాగా ఎత్తుగా చేశాడు, మంచి దృఢమైన స్తంభాలు తీసుకొచ్చి నిలిపాడు, పొడవైన వెదుళ్లతో వెన్నుబద్ద ఏర్పాటు చేశాడు, జమ్మికొమ్మలు తెచ్చి పరచి చాలా గట్టిగా కట్టుకట్టాడు. దానిమీద రెల్లుగడ్డి, దర్భలు, ఆకులు వేసి కప్పేశాడు, లోపలి నేలను చదునుచేశాడు.

ఆ పర్ణశాల చూడటానికి అందంగా, విశాలంగా ఉంది. రాముడికోసం చాలా సుందరంగా తీర్చిదిద్దాడు లక్ష్మణుడు. అక్కడ దేవతా పూజలుచేసి నివసించటానికి సిద్ధమైన పర్ణశాల రాముడికి చూపాడు.

ఆ పర్ణశాల చూడగానే ఆనందభరితుడై గట్టిగా తమ్ముని కౌగలించుకొని లక్ష్మణా "నాన్న లేని లోటు నీవు తీరుస్తున్నావు, నా తండ్రి నీ రూపంలో మరల కనబడుతున్నాడు నాకు" అని పలికాడు.

ఆ పర్ణశాలలో సీతా సమేతుడై, లక్ష్మణుడు సేవ చేస్తూ ఉండగా స్వర్గంలో దేవేంద్రుడు నివసించినట్లు కొంతకాలం నివసించాడు రామచంద్రుడు.

పంచవటీ తట సుస్థిత రాముడు ఆనందంగా కాలం వెళ్ళదీస్తున్నాడు.

రోజులు, వారాలు గడుస్తున్నాయి, నెలలు మారుతున్నాయి, ఋతువులు దొర్లుతున్నాయి, రాముడికి ఇష్టమైన హేమంతం రానే వచ్చింది.

ప్రకృతి రమణీయకత మనసుకు ఆహ్లాదకరంగా ఉంది.

ఒకనాటి రాత్రి గడిచి తెల్లవారింది. స్నానానికి గోదావరీ తీరానికి వెళ్ళాడు రాముడు. ఆయన వెంట సీతమ్మ, చేతిలో కలశంతో లక్ష్మణుడు కూడా వెళ్ళారు.

మంచు పడుతూ ఉంది, శరీరాలు బిరుసెక్కిపోయి వేడి పుట్టించే అగ్నికోసం వెతుక్కునే కాలమది. నీళ్లు ముట్టుకుంటే చేతులు జిల్లుమంటున్నాయి.

సూర్యుడు ఎక్కువగా దక్షిణ దిక్కునే ఉంటున్నాడు, ఉత్తర దిక్కు తిలకం లేని స్త్రీ వలె ప్రకాశించటం లేదు.

జనమంతా సూర్యోదయం కోసం, ఆయన కిరణ స్పర్శ కోసం ఎదురు చూస్తున్నారు. నీడలు, నీళ్ళు భరించలేక పోతున్నారు.

పడమర దిక్కునుండి చల్లటి గాలులు వీస్తున్నాయి. వరి చేలు బంగారు రంగును సంతరించుకొన్నాయి.

ఎండ కాస్త ఎర్రగా కాస్త తెల్లగా ఉంది, పచ్చిక బయళ్ళమీద మంచు బిందువులు పడి సూర్యకాంతికి ప్రతిఫలించి వజ్రాల రాశుల లాగా మెరుస్తున్నాయి.

ఏనుగులకు దాహం వేసి, నీటి దగ్గరకు వెళ్లి తొండం నీటికి ఆనించి మరల వెనుకకు లాగుకుంటున్నాయి.

పిరికివాడు ఏవిధంగా యుద్ధరంగానికి దూరంగా ఉంటాడో ఆవిధంగా నీటిపక్షులు నదిలోకి వెళ్ళకుండా దూరంగా ఒడ్డునే కాలక్షేపం చేస్తున్నాయి.

ప్రకృతి సొగసులు చూస్తూ అడుగులు వేస్తున్నాడు రాముడు.

ఆ సమయంలో లక్ష్మణుడికి భరతుడు గుర్తుకు వచ్చాడు. ఇంత తెల్లవారురుఝామున ఈ చలిలో భరతుడు స్నానమెలా చేస్తున్నాడో గదా!

అతడు సుకుమారుడు, సుఖాలకు అలవాటుపడ్డవాడు, నీవు అడవులకు వచ్చావు.. నిన్ను అనుసరిస్తూ ఆయన అక్కడ నియమ నిష్ఠలతో తాపస జీవనం గడుపుతున్నాడు.

మానవులు తండ్రి స్వభావాన్ని అనుకరించరు, తల్లి స్వభావాన్ని అనుసరిస్తారు. కానీ, భరతుని విషయంలో అలా జరుగలేదు, తల్లి స్వభావాన్ని అనుకరించలేదు.

అక్కడ భరతుడు ఇక్కడ మనం, ఇందరి కష్టాలకు కారణమైన స్వభావం కైకమ్మకు ఎక్కడనుండి వచ్చింది? ధర్మాత్ముడైన భర్త, ఋజువర్తనుడు అయిన కొడుకు కలిగిన స్త్రీ అలా ఎందుకు ప్రవర్తించిందో గదా!

వింటూ నడుస్తున్న రాముడు తల్లి నింద చెవుల పడేసరికి సహించ లేకపోయాడు, నాయనా లక్ష్మణా! ఎట్టిపరిస్థితిలోనూ మన మధ్యమాంబను నిందిస్తూ నీవు ఒక్క మాట కూడా మాట్లాడవద్దు, భరతుడి గురించి చెప్పు చాలా ఆనందంగా ఉంది నాకు అని అన్నాడు. మన నలుగురమూ కలిసి హాయిగా మళ్ళా ఎప్పుడోకదా ఉండేది అని అంటూ నదిని సమీపించాడు.

గోదావరిలో స్నానం చేసి, సకల దేవతార్చనలు పూర్తిచేసి తిరిగి పర్ణశాల చేరుకొని సుఖంగా ముగ్గురూ కబుర్లు చెప్పుకుంటూ ఉన్నారు.

అప్పుడు... ఒక ముసలి రాక్షస స్త్రీ, అక్కడకు వచ్చి దగ్గరగా రాముడిని చూసింది.

నయనమనోహరంగా కనబడ్డాడు రాముడు దానికి.

విశాలమైన వక్షస్థలం, బలిష్ఠమైన బాహువులు, విచ్చిన తామరపూవుల వంటి కన్నులు, నల్లకలువ వంటి శరీర ఛాయ, మన్మథునివంటి సౌందర్యంతో మహేంద్రుడిలాగా ఠీవిగా ఉన్నాడు రాముడు.

రాముడిని చూడగానే దాని మనస్సును మన్మథబాణాలు సూటిగా వేగంగా వచ్చి తాకాయి.

రాముడి ముఖం చాలా అందంగా ఉంది, దాని ముఖం వికృతం!

రాముడి నడుము సింహపు నడుములాగా సన్నగా ఉన్నది దానిది బాన పొట్ట.

ఆయన నేత్రాలు విశాలం, దాని నేత్రాలు వికారం!

ఆయనది నల్లని జుట్టు, దానిది రాగి జుట్టు.

చూసేవారి కన్నులకు ఆనందం కలిగించే రూపం ఆయనది, దానిది భయంకరమైన రూపం.

ఆయన కంఠ ధ్వని మధురం, దాని పలుకులు కర్ణ కఠోరమైనవి.

ఆయన నవయవ్వనుడు. ఆ రాక్షసి వృద్ధురాలు.

ఆమె పేరు శూర్పణఖ, రావణుడి చెల్లెలు!

రాముడిని సమీపించి రాముడితో ఎవరు నీవు? భార్యా సమేతుడవై, ధనుర్బాణాలు ధరించి ముని వేషంతో, రాక్షస నివాస ప్రాంతానికి ఎందుకు వచ్చావు, నీకు ఏమి పని ఇక్కడ అని పలికింది.

నీవెవ్వరవు? అని శూర్పణఖ అడిగిన ప్రశ్నకు ఉన్నదున్నట్లుగా తెలిపాడు రాముడు. తమ ముగ్గురి పేర్లు, తాము అడవికి ఎందుకు వచ్చినదీ సవివరంగా తెలిపాడు. రాముడు ఋజువర్తనుడు కావున ఏదీ దాయకుండా చెప్పాడు.

తమ గురించి చెప్పి, మరి నీవెవరవు అని అడిగాడు.

అందుకు ఆ రాక్షసి **"రావణో నామ మే భ్రాతా బలీయాన్ రాక్షసేశ్వరః"**.

విశ్రవసుని కుమారుడైన రావణుడు నా సోదరుడు, వాడు మహా బలవంతుడు.

ఎల్లప్పుడూ నిద్రలో ఉండే కుంభకర్ణుడు, ధర్మాత్ముడు రాక్షస ప్రవృత్తిలేని విభీషణుడు కూడా నా సోదరులే అని పలికింది.

పరాక్రమవంతులైన ఖరదూషణులు నా సోదరులు.

..(సశేషం)

# తమిళనాట మళ్ళీ.. భాషా 'ఘోష'

మనసులో మాట 34


తమిళనాట మరోసారి భాషా రాజకీయాలు వేడెక్కాయి. మరో ఏడాదిలో తమిళనాడు శాసనసభకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికార డీఎంకే పార్టీ తమిళ భాష అస్తిత్వ వాదాన్ని మరోసారి బలంగా ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోంది. జాతీయ విద్యా విధానంలో భాగంగా త్రిభాష సూత్రాన్ని తమపై రుద్దితే సహించేది లేదని ముఖ్యమంత్రి స్టాలిన్ స్పష్టం చేశారు. మొత్తంగా జాతీయ విద్యా విధానాన్ని తమిళనాడు ప్రభుత్వం వ్యతిరేకిస్తోంది. జాతీయ విద్యా విధానంతో రాష్ట్రాల ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుందని, రాష్ట్రాలను బలహీనపరచటమే కేంద్రం ఉద్దేశమని ఆరోపిస్తోంది.

జాతీయ విద్యా విధానం– 2020 మూడు భాషల సూత్రాన్ని అమలు చేయాలని పేర్కొంటుంది. విద్యార్థులు మూడు భాషలను నేర్చుకోవాలని, వాటిలో కనీసం రెండు భారతదేశానికి చెందినవిగా ఉండాలని స్పష్టం చేస్తోంది. అయితే మొదటి నుంచి తమిళనాడుది రెండు భాషల సిద్ధాంతం. హిందీకి వ్యతిరేకం. పాఠశాలల్లో తమిళం, ఆంగ్లం మాత్రమే బోధిస్తోంది. పాలక డీఎంకే, ప్రతిపక్ష అన్నాడీఎంకే రెండూ జాతీయ విద్యా విధానంపై తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. తమిళ భాషా వారసత్వాన్ని పరిరక్షించడం, ఏ రూపంలో హిందీని బలవంతంగా రుద్దాలని ప్రయత్నం చేసినా తాము వ్యతిరేకిస్తామని కుండ బద్దలు కొట్టి చెబుతున్నాయి.

సమగ్ర శిక్షా అభియాన్ వంటి పథకాల కింద నిధుల విడుదలను జాతీయ విద్యా విధానం అమలుతో ముడిపెట్టాలనే కేంద్రం నిర్ణయం వివాదాన్ని తీవ్రతరం చేసింది. జాతీయ విద్యా విధానం, మూడు భాషల విధానాన్ని అమలు చేయడానికి నిరాకరించిన కారణంగా సమగ్ర శిక్షా అభియాన్ నిధులు రూ.2,150 కోట్లకు పైగా కేంద్రం నిలిపివేసిందని తమిళనాడు ఆరోపిస్తోంది. ఆ నిధులు పొందడం తమ హక్కు అని, పన్నుల్లో వాటా అయిన నిధులను ఎలా నిలిపివేస్తారని నిలదీస్తోంది. "జాతీయ విద్యా విధానాన్ని అమలు చేస్తే తమిళనాడుకు రూ.2,000 కోట్లు వస్తాయని కేంద్రం చెబుతోంది. కేంద్రం రూ.10,000 కోట్లు ఇవ్వ చూపినా జాతీయ విద్యా విధానాన్ని మేము అంగీకరించం. జాతీయ విద్యావిధానాన్ని అమలుచేస్తే తమిళనాడును 2000 సంవత్సరాలు వెనక్కి నెట్టివేసినట్లే. ఆ పాపం నేను చేయను" అని ముఖ్యమంత్రి స్టాలిన్ అనడంతో తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. జాతీయ విద్యా విధానం 2020 అమలుతో నిధులను ముడిపెట్టవద్దని ఆయన ప్రధాని మోదీకి లేఖ కూడా రాశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ డీఎంకే ప్రభుత్వ వైఖరిని తప్పుబట్టారు. కేంద్రం ఏ భాషనూ ప్రత్యేకంగా రుద్దే ప్రయత్నం చేయటం లేదని స్పష్టం చేశారు. అసలు నూతన విద్యా విధానం వద్దు అనడం ఏమిటని తప్పుపట్టారు. మాతృభాషలో బోధించాలని నూతన విద్యా విధానం స్పష్టం చేస్తున్నదని, నూతన విద్యా విధానాన్ని వ్యతిరేకించడం ద్వారా తమిళ భాషలో బోధించవద్దంటారా అని డీఎంకే ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

కేవలం భాష విషయంలోనే కాదు, నూతన విద్యా విధానం రాష్ట్రాల హక్కును హరించే విధంగా ఉందని తమిళనాడు అంటోంది. జాతీయ విద్యా విధానం రాష్ట్ర స్వయంప్రతిపత్తిని తగ్గిస్తోందని తమిళనాడు వాదిస్తోంది. రాజ్యాంగం ప్రకారం విద్య ఉమ్మడి అంశాల జాబితాలో ఉన్నందున కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా తమపై రుద్దలేదని స్పష్టం చేస్తోంది. ప్రాంతీయ – సామాజిక–ఆర్థిక, సాంస్కృతిక భేదాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకరీతి జాతీయ విధానాన్ని రుద్దుతోందని రాష్ట్రం వాదిస్తోంది. రాష్ట్రాల్లో ఉండే ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా విద్యను రూపొందించుకునే హక్కును కేంద్రం ఉల్లంఘిస్తోందని డీఎంకే ప్రభుత్వం విమర్శిస్తోంది. అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లను బహుళ నిష్క్రమణ ఎంపికలతో నాలుగు సంవత్సరాల కోర్సుగా మార్చాలని నూతన విద్యావిధానం ప్రతిపాదిస్తోంది. విద్యార్థులు ఒక సంవత్సరం తర్వాత సర్టిఫికేట్‌తో, రెండు సంవత్సరాల తర్వాత డిప్లొమాతో లేదా పూర్తి ప్రోగ్రామ్‌ను పూర్తి చేసిన తర్వాత డిగ్రీతో నిష్క్రమించడానికి నూతన విద్యా విధానం అనుమతిస్తోంది. తమిళనాడులోని విమర్శకులు ఈ విధానం డ్రాపౌట్ రేట్లు పెరగడానికి దారితీస్తుందని భయపడుతున్నారు. జాతీయ విద్యావిధానం కింద ప్రతిపాదించిన ప్రవేశపరీక్షా విధానాలను కూడా తమిళనాడు తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.

వాస్తవానికి నూతన విద్యా విధానంలో చాలా సానుకూల అంశాలు ఉన్నాయి. వివిధ రంగాల్లో అంతర్జాతీయస్థాయిలో భారత్ వెనకబడిపోవడానికి పరిశోధన, అభివృద్ధిలో సరైన పునాది లేకపోవటమే కారణమని ఎన్నో లోతైన అధ్యయనాలు చేసిన తర్వాత విద్యావేత్తలు, వివిధ రంగాల నిపుణులు తేల్చారు. విద్యా రంగంలో సంస్కరణలే దీనికి పరిష్కారమని వారు ఒక అంచనాకొచ్చారు. ఫలితంగానే నూతన విద్యా విధానం రూపుదిద్దుకుంది. ఇందులో ఒక ముఖ్యమైన అంశం ఏంటంటే, ఆంగ్లంలో విద్యాబోధన వల్ల విషయపరిజ్ఞానం పూర్తిగా విద్యార్థులకు అర్థం కావడం లేదని, ప్రాథమిక విద్యను పూర్తిగా మాతృభాషలోనే బోధించాలని నూతన విద్యా విధానం స్పష్టం చేస్తోంది. నూతన విద్యా విధానం ప్రతిపాదించిన త్రిభాషా సూత్రం ప్రకారం రెండు భారతీయ భాషలు, ఒక విదేశీ భాష ఉండాలి. ఇందులో ఒక భారతీయ భాష మాతృభాష అయి ఉంటుంది. ఎందుకంటే ప్రాథమిక విద్యా బోధన మాతృభాషలోనే ఉండాలని కూడా ఇదే నూతన విద్యా విధానం స్పష్టం చేస్తోంది. కానీ హిందీని దొడ్డిదారిన రుద్దడానికి, హిందీ భాష ద్వారా చరిత్రను కేంద్రం తనకు నచ్చిన రీతిలో రాష్ట్రాలపై రుద్దుతుందనేది తమిళనాడు వాదన. ఇలాంటి ఆందోళనలు ఉన్నప్పుడు వాటిని సామరస్యంగా పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్రం పై ఉంది. తమిళనాడు చేస్తున్న వాదనను రాజకీయమని కొట్టి పారేయడం కాకుండా, చర్చలకు పిలిచి విడమర్చి చెప్పాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. ఇదే అసలైన సమాఖ్య స్ఫూర్తి.



తుమ్మల బాల గంగాధర్ తిలక్

# శ్రీ రామలింగేశ్వరుని సేవలో.. కాకర్ల



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని, దుత్తలూరు సమీపంలోని కొండపై వెలసివున్న శ్రీ రామలింగేశ్వర స్వామి వారిని ఈనెల 26న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఆలయ ఛైర్మెన్ కంభం విజయరామిరెడ్డి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతించారు. అనంతరం, ఆలయ ప్రాంగణంలో శ్రీ రామలింగేశ్వర స్వామి వారి క్యాలండర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. భక్తుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటుచేసిన త్రాగునీటి కొళాయిలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, శ్రీ రామలింగేశ్వరస్వామి వారిని దర్శించుకోవడం తనకు ఆనవాయితీ అన్నారు. స్వామివారి దర్శనం మహద్భాగ్యమన్నారు. ఉదయగిరి నియోజకవర్గాన్ని పర్యాటక కేంద్రంగా చేయడమే తమ లక్ష్యమని, అందులో శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం కూడా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ వెంకటరత్నం, మాజీ జెడ్పిటిసి సభ్యులు మల్లికార్జున, వెంగళరెడ్డి, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మాతృభాషతోనే ధారణశక్తి!

**• మహా సహస్రావధాని మేడసాని మోహన్**



మాతృభాష పట్ల ప్రతిఒక్కరూ మమకారంతో ఉండాలని, మాతృభాషతోనే భాషపై పట్టు, ధారణశక్తి ఏర్పడతాయని మహాసహస్రావధాని, టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు మాజీ డైరెక్టర్ డా. మేడసాని మోహన్ చెప్పారు. ఇటీవల ఆయన గూడూరులోని అపుస్మా, ఇన్నర్‌వీల్ క్లబ్, మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో, ఎస్‌వి ఆర్ట్స్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాతృభాష గొప్పదనంపై మాట్లాడారు. ప్రపంచభాషల్లో ఎక్కడా అవధాన ప్రక్రియ లేదని, ఆ గౌరవం ఒక్క తెలుగుభాషకే దక్కిందన్నారు. అమ్మభాషలో అందరూ మాట్లాడుకోవాలని, భాషను పరిరక్షించుకోవాలని అన్నారు. సభకు ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ అధ్యక్షత వహించగా, డాక్టర్ సిఎంకె రెడ్డి, డాక్టర్ రోహిణి, డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, ప్రొఫెసర్ నిరంజన్‌రెడ్డి, డాక్టర్ ఎస్.మమత, పోలవరపు లక్ష్మీనరసింహారావు, డా. గంగిశెట్టి శివకుమార్, కళాశాల కరెస్పాండెంట్ కేఆర్‌రెడ్డి, బాలకృష్ణంరాజు, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

# శ్రీసిటీలో మిన్నుముట్టిన శివరాత్రి సంరంభం

## వైభవోపేతంగా 'రుద్రాక్ష వృక్ష పూజ'



మహాశివరాత్రి ఉత్సవాలు శ్రీసిటీలో అంబరాన్నంటాయి. ఈనెల 26 మహాశివరాత్రి సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు శ్రీసిటీలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చి, ఆలయ ప్రాంగణంలో ఆ పరమేశ్వరుని దివ్యరూపంగా భావించే 'రుద్రాక్ష వృక్షం' వద్ద పెద్దఎత్తున పూజలు చేశారు. ఆదిదేవునికి అభిషేకం, అర్చన, వేదమంత్ర పారాయణ పూజలతో పాటు, భక్తుల 'ఓం నమ:శివాయ' పంచాక్షరీ నామజపాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం ట్రిపుల్ ఐటి మరియు క్రియా యూనివర్సిటీ విద్యార్థులు సామూహిక భజనలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ధ్యాన కార్యక్రమంలో పాల్గొని దివ్యానుభూతిని పొందారు. మహా శివరాత్రి భక్తికి, ఆంతర్ముఖతకు ప్రతీక అంటూ ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి చెప్తూ, అందరిలో భక్తిభావాన్ని పెంపొందించారు. ఆలయంలోని రుద్రాక్ష వృక్షాన్ని.. ఆ మహాదేవుని పవిత్ర సన్నిధిని సూచించే పెన్నిధిగా అభివర్ణించారు. పి.ఎస్.బి.శాస్త్రి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. శ్రీసిటీ సోషియల్ ఇన్‌ఫ్రా విభాగానికి చెందిన అవినాష్ వేడుకల నిర్వహణను పర్యవేక్షించారు. అనంతరం, భక్తులందరికీ అన్నప్రసాదాలు అందచేశారు.

# ధాన్యం ధరలు గిట్టుబాటు కావడం లేదు

**• కలెక్టర్‌కు మొరపెట్టుకున్న రైతులు**

ధాన్యానికి గిట్టుబాటు ధర ఉండడం లేదని, ఆరుగాలం కష్టించినా దిగుబడి తగ్గిపోయి ఒకవైపు, ధరలు గిట్టుబాటు కాక మరోవైపు అవస్థలు పడుతున్నామంటూ పలువురు రైతులు జిల్లా కలెక్టర్‌తో మొరపెట్టుకున్నారు. ఇటీవల కలెక్టర్ ఆనంద్ పొదలకూరు మండలం మహమ్మదాపురానికి వచ్చినప్పుడు, రైతులు ఆయన్ను కలిశారు. మిల్లర్లు కళ్లాల దగ్గరకొచ్చి రైతుల వద్దనుంచి కేఎన్ఎం 1638 రకం వరి ధాన్యాన్ని 17వేలా 500కి మాత్రమే కొంటున్నారని, దీంతో తమకు మిగిలేదేమీ ఉండదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది ఇక్కడ ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేశారని, ఈసారి అది కూడా ఇంకా తెరవలేదని వారు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వీలైనంత త్వరగా కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయాలని వారు కోరారు.

**తిరుపతి జిల్లా గూడూరు డివిజన్**

# అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

**ఎమ్మెల్యే సునీల్‌కుమార్**



గ్రీవెన్స్ డే కార్యక్రమంలో వచ్చిన అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు పనిచేయాలని గూడూరు ఎమ్మెల్యే సునీల్‌కుమార్ అన్నారు. గూడూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించారు. గూడూరు పట్టణం, గూడూరు మండలం, చిల్లకూరు మండలాల నుండి ప్రజలు వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే సునీల్‌కుమార్, అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని శాంతినగర్ ప్రాంతానికి చెందిన కొత్తపల్లి రమణయ్యకు 50వేల రూపాయల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును అందజేస్తూ, దీర్ఘకాలంగా ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నవారి వివరాలు అందజేస్తే సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

# వేడుకగా రోటరీ ఇంటర్నేషనల్ 120వ వార్షికోత్సవం




గూడూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 23వ తేదీ రోటరీ ఇంటర్నేషనల్ 120వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రోటరీ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు పాల్ హారీస్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా పలువురు ఇంజనీరింగ్ విద్యార్థులకు దొడ్ల రుక్మిణమ్మ స్కాలర్‌షిప్స్ ఇవ్వడంతో పాటు, సైబరాబాద్ రోటరీ క్లబ్ అధ్యక్షులు చదలవాడ మురళీధర్ దాతృత్వంతో చిలమాన్‌చేను ఉన్నత పాఠశాలకు రెండు కంప్యూటర్లు అందజేశారు. డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ రోహిణి దంపతులు కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. జాయింట్ కార్యదర్శి రాంప్రసాద్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పీడీజీ బి.సురేంద్ర, పీడీజీ కె.మునిగిరీష్‌లు పాల్గొనగా, రోటరీ క్లబ్ అధ్యక్షులు రొటేరియన్ బి.వి.శ్రీధరరెడ్డి, పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ బి.దశరథ రామిరెడ్డి, పాస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ నాగేంద్ర ప్రసాద్, అసిస్టెంట్ గవర్నర్ వాసుగౌడ్, రోటరీ క్లబ్ వెస్ట్ అధ్యక్షుడు నాగులు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతమే లక్ష్యం



పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ తెలిపారు. గూడూరు పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో పార్టీ నాయకులతో ఆయన ఫిబ్రవరి 24న సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పట్టణంలోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో యువమోర్చా ఆధ్వర్యంలో వాజపేయి ప్రతిభా పురస్కారాలను విద్యార్థులకు అందజేశారు. పట్టణ అధ్యక్షుడు కె.దయాకర్, నాయకులు పురుషోత్తంరెడ్డి, బాలకృష్ణం నాయుడు, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు లయన్స్ క్లబ్ సేవలు



లయన్స్ క్లబ్ జోన్ ఛైర్మన్ కె.ఆదిశేషారెడ్డి ఇటీవల గూడూరు వచ్చిన సందర్భంగా గూడూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు ఆర్.రవిచంద్ర అధ్యక్షతన పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సరస్వతి శిశుమందిరంలోని పేదలకు సరుకులు, చీరలు, దుప్పట్లు పంపిణీ చేయడమే కాకుండా పేద మహిళల జీవన భృతి కోసం బండి కొట్టు నిర్వహించేందుకు సరుకులు అందజేశారు. లయన్ ఎం.రాధాకృష్ణ దాతృత్వంలో సాయిరాం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నప్రసాదం, క్లబ్ కార్యదర్శి శివయ్య దాతృత్వంతో వృద్ధాశ్రమానికి మిక్సీ అందించడం జరిగింది. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్లు షేక్ రియాజ్ అహ్మద్, మల్లెమాల మురళీరెడ్డి, వాకాటి రామ్మోహన్, రూపేష్‌రెడ్డి పాల్గొన్నారు.

# విద్యార్థులలో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించాలి



గూడూరులోని శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు టెక్నికల్ నాలెడ్జ్ హంట్‌లో భాగంగా, రాష్ట్రస్థాయిలో గుర్తింపు కలిగిన ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్&టెక్నాలజీని సందర్శించి ఇంజనీరింగ్‌లో గల వివిధ శాఖలు, అనుబంధ ప్రయోగశాలలు, ఉపకరణాలు, రోబోటిక్ టెక్నాలజీ, ఏఐ ల్యాబ్ విశిష్టతలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి విద్యార్థులలో శాస్త్రీయ సృజనాత్మకత పెంపొందించేందుకు విద్యార్థులను ప్రోత్సహిస్తున్న శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి అభినందనీయుడని కొనియాడారు. ఎన్‌బికెఆర్ కళాశాల ప్రొఫెసర్లు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

# మాటలు కాదు.. మూటలు కావాలి!

(మొదటిపేజీ తరువాయి)

అయితే, ఉచితాలు అందుకోవడం అనుచితం కాదని భావిస్తున్న జనం, సంక్షేమ పథకాల అమల్లో మాటలు కాదు, కాసుల మూటలు కావాలంటూ కూటమి హామీలపై ఆశలు పెట్టుకున్నారు. మరి అంత, ఇంతా అంటూ కూటమి ప్రభుత్వం అంకెల గారడీ చేస్తుందా? లేక చిత్తశుద్ధితో నిధులు కేటాయిస్తుందా? అన్నది చూడాలి!

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో డెక్కాముక్కీలు తిని, చావోరేవో అనే స్థితిలో ఎన్నికల సంగ్రామంలో దూకి ఘనవిజయం సాధించిన కూటమి పార్టీలకి అసలు, సిసలు పరీక్ష మొదలైంది. 164 సీట్లతో తిరుగులేని మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటైనా, హామీల అమలులో మేమే వీరులం అని చెప్పుకోలేని పరిస్థితి వారిది. దీనికి ప్రధాన కారణం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం కావడమే. ఇలాంటి సమయంలో అమరావతికి కనీసం రూ.50 వేల కోట్లు అవసరం ఉండడం, పోలవరానికి మరో 30వేల కోట్ల వరకు వెచ్చించాల్సిన పరిస్థితి రావడం, సూపర్ సిక్స్ పథకాలకైతే ఏకంగా ఏడాదికే రూ.లక్ష కోట్లకుపైగా ఖర్చవుతుందనే అంచనాలుండడం వారిని కలవరపరుస్తోంది. ఈ నేపథ్యంలో 2025–26 బడ్జెట్ చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి కత్తిమీద సాము అనడంలో ఎలాంటి అనుమానం లేదు.

## సూపర్ సిక్స్.. ఏమౌతుందో..?

నిజానికి రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు అన్నది దశాబ్దాలుగా ఉన్న వ్యవహారమే అయినా, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దీనికి సరికొత్త అర్థాన్ని చెప్తూ అతి సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధిని అటకెక్కించారనే విమర్శ ఉంది. ఫలితంగా ఒక దశలో రాష్ట్రంలో కనీస మౌలికసదుపాయాలకు కూడా నిధులు వెచ్చించలేని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రభుత్వ ఉద్యోగులు, మధ్యతరగతి వర్గ ప్రజలు వైఎస్సార్‌సీపీకి పూర్తిగా దూరమయ్యారన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమయింది. అదే సమయంలో నాయకుల వ్యవహార శైలి, అసంబద్ధ వ్యాఖ్యలు ఆ పార్టీ పుట్టి మునగడానికి కారణంగా కూడావిశ్లేషకులు పలు సందర్భాల్లో పేర్కొన్నారు. సరిగ్గా ఇలాంటి సమయంలోనే చంద్ర బాబు, పవన్ కల్యాణ్, భారతీయ జనతా పార్టీతో జతకట్టి అంతకు మించిన సంక్షేమం అందిస్తామంటూ సూపర్ సిక్స్ పథకాలను తెరపైకి తెచ్చారు. వీటిని నమ్మిన ప్రజలు కూటమిని బంపర్ మెజారిటీతో గెలిపించారు. అయితే, అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ అమల్లో కూటమి సన్నాయి నొక్కులు, ప్రజల్లో అనుమానాలకు తావిచ్చేలా ఉన్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో ఆ అనుమానాలు, అసంతృప్తిగా మారకూడదంటే కూటమి ప్రభుత్వ పెద్దలు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. అయితే, అశనిపాతంగా మారిన ఆర్థిక కష్టాలను అధిగమించి, అప్పులు తెచ్చి, కేంద్రాన్ని ఒప్పించి పథకాలను అమలు చేయడం కూటమికి సాధ్యమేనా..? అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

## కేశవా.. నిధులు కేటాయిస్తావా...?

సూపర్ సిక్స్ పథకాల్లో వృద్ధాప్య పింఛన్ రూ.4 వేలకు పెంచడం, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి కార్యక్రమాలను చంద్రబాబు ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తోంది. 64లక్షల మంది లబ్ధి దారులు సామాజిక పింఛన్లు పొందుతున్నారు. ఇక దాదాపు 70లక్షల మంది ఉచిత సిలిండర్లు అందు కుంటున్నారు. ఇక సూపర్ సిక్స్‌లో అత్యంత ముఖ్య మైన అంశం తల్లికి వందనం. ఈ పథకం ద్వారా పిల్లలను బడికి పంపించే తల్లి ఖాతాలో ఎంతమంది బిడ్డలుంటే ఒకొక్కరికీ ఏడాదికి రూ.15 వేలు చొప్పున అందిస్తామని మేనిఫెస్టోలో చంద్రబాబు ప్రకటించారు. దీనిని అమలు చేయడం అత్యంత కష్టమైన పనిగా విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో 42 లక్షల మంది తల్లుల ఖాతాలో వైఎస్ జగన్ ప్రభుత్వం సంవత్సరానికి రూ.15వేలు చొప్పున వేసింది. తర్వాత కాలంలో రెండువేలు స్కూల్ మెయిన్‌టెనెన్స్ కోసం అంటూ కోత విధించి రూ.13వేలు చొప్పున అందించింది. అయితే, ప్రస్తుతం ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ కోతల్లేకుండా రూ.15వేలు చొప్పున వేయాల్సి ఉంది. దీంతో లబ్ధిదారుల సంఖ్య 73 లక్షల మందికి చేరు తుందని అంచనా వేస్తున్నారు. ఈ పథకాన్ని మేలో అమలుచేస్తామని చంద్రబాబు అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారు. అయితే బడ్జెట్‌లో ఏమేరకు నిధులు కేటాయిస్తారన్నది ఇప్పుడు ఆసక్తికర అంశంగా మారింది. అలాగే అన్నదాత సుఖీభవ కింద రాష్ట్రం లోని రైతులందరికీ ఏడాదికి రూ.20 వేలు చొప్పున బ్యాంక్ ఖాతాల్లో వేయాల్సి ఉంది. ఇదికూడా కూటమికి గుదిబండ లాంటిదే. అంతేకాకుండా రాష్ట్రంలోని 1.54కోట్ల మంది రేషన్ కార్డులున్న మహిళల ఖాతాల్లో నెలకు ఆడబిడ్డ నిధి పథకంలో భాగంగా ప్రతినెలా రూ.1,500 జమచేయాల్సి ఉంది. యువ తకు 20 లక్షల ఉద్యోగాలు, 40 లక్షల మంది నిరు ద్యోగులకు ప్రతినెలా రూ.3వేలు నిరుద్యోగ భృతి అందించాల్సి ఉంది. అలాగే తొలి సంతకం అన్న ఉపాధ్యాయ నియామక పరీక్ష డీఎస్సీకి సంబంధించి ఇంత వరకు నోటిఫికేషన్ విడుదల కాలేదు. ఇక బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం త్వరలోనే అమలు చేస్తామంటూ పరిశీలన కోసం మంత్రుల కమిటీని కూడా ప్రకటించారు. ఈనేపథ్యంలో వీట న్నింటికీ ఎంతలేదన్నా రూ.లక్ష కోట్లకు పైగానే ఖర్చవుతుందన్నది నిర్వివాదాంశం. మొత్తం రూ.3 లక్షల కోట్లకు అటూ ఇటూగా బడ్జెట్ ఉంటుందని భావిస్తున్న తరణంలో రూ.లక్ష కోట్లకు పైగా సంక్షేమ పథకాలకు వెచ్చించడం కుదరనిపని అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక పోలవరం, అమరావతి ఎలాగూ ఉన్నాయి. వీటికితోడు రాష్ట్రం చెల్లించాల్సిన అప్పులు, వాటికి కట్టాల్సిన వడ్డీలు, ప్రభుత్వ ఉద్యోగులకు జీత భత్యాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు తడిసి మోపెడవుతాయనడంలో సందేహం లేదు. వీటన్నింటికీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవుడు నిధుల కేటాయింపులు ఏ ప్రాతిపదికన చేస్తారు..? ఎలా సమన్వయం కుదుర్చుతారు...? అన్నది ఇప్పుడు అత్యంత ఆసక్తికరంగా మారింది.

## ఇతర పథకాల మాటేమిటి..?

అసలు పథకాలైన సూపర్ సిక్స్‌కే, లెక్కకు మిక్కిలి అడ్డంకులుంటే మరి కొసరు పథకాల సంగతేమిటనే వాదనలు కూడా లేకపోలేదు. డ్వాక్రా మహిళలకు రూ. 3 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు, ఉద్యోగాలు చేసే మహిళలకు ప్రభుత్వ ఆధ్వర్యంలో హాస్టల్ వసతి, పీ4 మోడల్, కళలకు రెక్కలు పథకం ద్వారా విద్యార్థులకు రుణాలు, పండుగ కానుకలు, పెళ్లికానుకలు వంటి హామీల అమలు ఏమౌతుందనే అంశం కూడా చర్చనీయాంశంగా మారింది. ఇక ఉపాధ్యాయ, ఉద్యోగుల కోర్కెల చిట్టా ఎలాగూ చాంతాడంత ఉంది. వారి డీఏ బకాయిలూ పెద్దఎత్తున పేరుకుపోయాయి. గత ఏడాది ప్రవేశ పెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఈ విషయాలను విస్మరించినా, వార్షిక బడ్జెట్‌లో మాత్రం ఎంతోకొంత నిధులు కేటాయించక తప్పని విషమ పరిస్థితి ప్రస్తుతం కూటమి ప్రభుత్వానికి ఏర్పడింది.

## సంపద సృష్టి ఎంతవరకు వచ్చిందో..?

గతంలో నవరత్నాల పథకాల ద్వారా రూ.53 వేల కోట్ల మేరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏటా సంక్షేమానికి వెచ్చించింది. అయితే, చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలకు గతంతో కలిపి మరో రూ.73 కోట్ల వరకూ అదనంగా ఖర్చువుతుందని అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తేల్చారు. అంటే మొత్తం రూ.1.26 లక్షల కోట్లను సంక్షేమ పథకాల కోసమే వెచ్చించే పరిస్థితిలో రాష్ట్రం లేదని, వీటి అమలు సాధ్యంకాదని విమర్శించారు. చంద్రబాబు మోసగించేందుకే సూపర్ సిక్స్ అంటూ ప్రజల ముందుకొస్తున్నారని ధ్వజమెత్తారు. అయితే సంపద సృష్టి ద్వారా, అవినీతికి అడ్డుకట్ట వేయడం ద్వారా పథకాలకు నిధులు సమకూర్చుతామని అప్పట్లో చంద్రబాబు ప్రజలకు హామీ ఇచ్చారు. ఈనేపథ్యంలో సంపద సృష్టి ఎంతవరకు వచ్చింది...? సూపర్ సిక్స్‌లో ఎన్ని పథకాలను ఈ ఏడాది తెరపైకి తీసుకురాను న్నారు...? వాటికి బడ్జెట్‌లో ఎంతమేరకు కేటాయిం పులు ఉంటాయి...? అమరావతి అభివృద్ధికి, పోల వరం నిర్మాణానికి ఎంతమేరకు అంచనాలు రూపొం దించనున్నారు...? వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాల్లో వేటివేటికి ఎంత ప్రాధాన్యం ఇవ్వను న్నారు...? ప్రణాళిక వ్యయం, ప్రణాళికేతర వ్యయం ఎంత ఉంటుంది...? బడ్జెట్ లోటు ఏమేరకు ఉం టుంది..? దాని భర్తీకి ఎలాంటి వ్యూహాలు అమలు చేయనున్నారు..? మొత్తం ఆదాయం ఎంత, వ్యయం ఎంత..? వంటి ప్రశ్నలన్నిటికీ చంద్రబాబు ప్రభుత్వం బడ్జెట్‌లో సమాధానాలు ఇవ్వవలసిన అవసరం వుంది.


## హామీలను విస్మరిస్తే..?

కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కూడా పూర్తిగా కాలేదు. ఈ నేపథ్యంలో సంక్షేమ పథకాల అమలుకు మరికొంత వ్యవధి తీసుకున్నా, ఇప్పటికిప్పుడు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం లేదు. అయితే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపై మాత్రం ఈ ప్రభావం ఖచ్చితంగా పడే అవకాశం ఉంటుంది. ఇక సరైన స్థాయిలో నిధులు కేటాయించకుంటే, ప్రతిపక్షం మాత్రం ప్రభుత్వంపై దూకుడు పెంచి, నువ్వా నేనా అనే రీతిలో తలపడే అవకాశం కూడా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇటీవల అభివృద్ధికి ఐదు గ్యారెంటీలు అంటూ కర్నాటక, తెలంగాణలో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వాలు వాటిని అమలుచేసే విషయంలో ఆపసోపాలు పడుతూ ముందుకు సాగుతున్నాయి. ఇలాంటి తరణంలో చంద్రబాబు ప్రభుత్వం సూపర్ సిక్స్‌ను ఎలా అమలు చేస్తుందన్నది బడ్జెట్‌లో తేటతెల్లం కానుంది. జనం మాత్రం మాకు మాటలు కాదు కాసుల మూటలు కావాలి అంటు న్నారు. ఇలాంటి పరిస్థితులలో 5.4 కోట్ల మంది ఆంధ్రుల ఆశలు.. పయ్యావుల ప్రవేశపెట్టే పద్దుపై ఉన్నాయనడంలో సందేహం లేదు. మరి వాటిని ఆయన సంపూర్ణంగా నెరవేరుస్తారా..? పూర్తిగా నీరు గారుస్తారా....? అన్నది రాజకీయ తాంత్రికుడు చంద్రబాబుకే ఎరుక.!

# కళ్యాణ వైభవం...!




ప్రముఖ వైద్యులు, నెల్లూరు వాస్తవ్యులు ఎన్.ఆర్.సాయికుమార్ షడ్డకుడు, డాక్టర్ ఉషాకిరణ్ చెల్లెలు లేట్ ఎం.రవీంద్రనాథ్‌రెడ్డి - శోభారాణిల కుమారుడు **నిషాంత్‌రెడ్డి - డాక్టర్ మోహనసాయి రూప**ల వివాహం ఫిబ్రవరి 23వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనెలు.




వెంకటాచలం మండలం, పూడిపర్తి గ్రామ వాస్తవ్యులు పోతిరెడ్డి శ్రీనివాసులురెడ్డి - మంజులల కుమార్తె **డాక్టర్ శ్రీకళ్యాణి - వినయ్‌రెడ్డి**ల కళ్యాణం ఫిబ్రవరి 23వ తేదీ నెల్లూరులో ఘనంగా జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాభినందనలు.

# శ్రీశైల క్షేత్రంలో ఎన్‌బికెఆర్ విద్యార్థిని నాట్యం



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్టీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని పిండి గాయత్రి.. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీశైల దేవస్థానంలో మహాశివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 24న అద్భుతంగా భరత నాట్యం ప్రదర్శించి దేవాదాయశాఖ వారి ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా ఎన్‌బికెఆర్ కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి, అధ్యాపకులు ఆ విద్యార్థినికి అభినందనలు తెలిపారు.



## అదానీ ఫౌండేషన్ ఆరోగ్య శిబిరం

నెల్లూరు కలెక్టరేట్‌లో ఈనెల 24న అదాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరోగ్యశిబిరం ఏర్పాటైంది. తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్)లో భాగంగా అదానీ ఫౌండేషన్, అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ వారు ఏర్పాటుచేసిన వైద్యశిబిరాన్ని జిల్లా కలెక్టర్ ఆనంద్ ప్రారంభించారు. ప్రతి సోమవారం నెల్లూరు కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శిస్తున్న వందలాదిమంది ప్రజలు, కలెక్టరేట్ ఉద్యోగులు, జర్నలిస్టులు తదితరులకు ఈ శిబిరంలో అపోలో ఆసుపత్రి వైద్యుల బృందం ఆరోగ్యపరీక్షలు నిర్వహించి తగు సూచనలు, సలహాలు ఇచ్చింది. ఈ సందర్భంగా అదానీ ఫౌండేషన్ సామాజిక సేవలను జిల్లా కలెక్టర్ ఆనంద్ అభినందించారు. అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈఓ జగదీష్ పటేల్ సారధ్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. కలెక్టరేట్ ఏఓ విజయ్ కుమార్, కార్పొరేట్ వ్యవహారాల అధిపతి కె.ఎం.రామ్, హెచ్ఆర్ అడ్మిన్ అధిపతి అనురాగ్ ద్వివేది, భద్రత-పర్యావరణ విభాగం అధిపతి కౌశల్‌సింగ్, డాక్టర్ సుహర్షన్‌రెడ్డి, రవీంద్ర.టి, అరుణ్.టి, షేక్ షాహుల్‌హమీద్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక సంక్షేమనిధి ఏదీ?




కార్మిక సంక్షేమం అంటూ ప్రభుత్వాలు గొప్పలు చెప్తుంటాయే తప్ప, ఆచరణలో మాత్రం కనిపించడం లేదని భవన నిర్మాణ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల్లూరులో ఈనెల 24న భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఎంతోకాలంగా ఉన్న తమ సమస్యలు తీర్చాలని కోరారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ నిధి గత అయిదేళ్లుగా నిలిచిపోయిందని, ప్రభుత్వం తమ కష్టాలు గమనించి దానిని పునరుద్ధరించాలని కోరారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి ముక్తియార్, నాగరాజ్, ఎస్‌కె మహ్మద్, నరసింహాచారి పాల్గొన్నారు.

## తెలుసుకోరెందుకో?



సంగమంలో
జన హోరు....
రహదారుల్లో
రక్తపుటేరు.

వురుకులు పరుగులు
ముందెళ్ళి మునకేయాలని
పుణ్యాన్ని పొదివి పట్టుకునేయాలని
అందుకే తొక్కిసలాట...
బతికి బయటపడ్డా
పాదాల రక్తపు మరకలు
కడిగినా పోవని
తెలుసుకోరెందుకో?

మానవత్వం మరుగునపెట్టి
ఎన్ని పుణ్య నదుల్లో మునిగిలేసినా
జలాలు కూడా మలినాలని
వదలగొట్టలేవని
తెలుసుకోరెందుకో...

నిజాయితీగా వుంటూ
సాటి మనిషికి
చేతనైన సాయంచేస్తే
కలిగే సంతృప్తి
పుణ్యంకంటే ఎక్కువని
తెలుసుకోరెందుకో?

- రామిశెట్టి భాస్కర్‌బాబు
9849166103.

# శ్రీసిటీ జపనీస్ కంపెనీల వితరణ

### 2.10 లక్షలతో అంగన్‌వాడీ కేంద్రానికి క్రీడా వసతులు



శ్రీసిటీ పరిధిలోని మల్లవారిపాలెం వెస్ట్ అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో పిల్లలు ఆడుకునేందుకు వీలుగా అధునాతన క్రీడా వసతులను శ్రీసిటీ జపనీస్ కంపెనీస్ గ్రూప్ (ఎస్‌జేసీజి) ఏర్పాటు చేసింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాలలో భాగంగా అందుకు రూ.2.10 లక్షల రూపాయలను వ్యయం చేసింది. ఇందులో చిన్నపిల్లలు ఎంతో ఇష్టంగా ఆడుకునే ఊయల, జారుడుబండ, స్వింగ్, స్లైడ్, మెర్రిగో తదితర ఆట వస్తువులను అమర్చారు. ఈనెల 24న నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎస్‌జేసీజీ ప్రతినిధులు యుయిచి టోమిటా (ఐసాన్ ఆటో పార్ట్స్ ఇండియా), యుజి కొమోరి (డైకి అల్యూమినియం ఇండస్ట్రీస్), హరిహరన్ (ఐఎంఓపీ), ఫుమిహిటో ఇటో (నిట్టన్ ఇండియా టెక్), తకాషి సగావా, యోసుకే మగోషి (అల్సాక్ ఇండియా) పాల్గొని, శ్రీసిటీ డైరెక్టర్ (సిఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి సమక్షంలో అంగన్‌వాడీ కేంద్రంలో క్రీడా వసతులను ప్రారంభించారు. శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్రకుమార్, గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పెంచలకోనలో నిత్యాన్నదానానికి విరాళం

- 2 లక్షలిచ్చిన దాతలు



నెల్లూరుజిల్లాలో అత్యంత ప్రాచీనమైన పెంచలస్వామి దేవాలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. రాపూరు మండలం పెంచలకోనలో ఉన్న ఈ దేవస్థానానికి ఒక్క నెల్లూరు నుంచే కాక, చిత్తూరు-కడప-నెల్లూరు తదితర జిల్లాల నుంచి నిత్యం వందలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు వస్తూనే ఉంటారు. పెంచలకోనలో స్వామివారు స్వయంభువుగా వెలిశారని ప్రతీతి. శ్రీ ఆదిలక్ష్మి-చెంచులక్ష్మీ దేవేరుల సమేత శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి దేవాలయంగా రూపుదిద్దుకున్న ఈ పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులకు అన్నానికి కొరత లేకుండా దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి భక్తులు, దాతలు పెద్ద మొత్తాల్లో విరాళాలు సమర్పించుకుంటూనే ఉంటారు. ఇటీవల నాయుడుపేటకి చెందిన దివంగత సిద్ధంశెట్టి నరింహులు జ్ఞాపకార్థం వారి కుమారుడు రామ్‌చరణ్, కుమార్తె జనని లక్షా ఒక్క రూపాయలను తమ విరాళంగా అందజేశారు. ఆలయ అర్చకులు బాలాజీస్వామికి ఆ చెక్కును అందజేశారు. అదేవిధంగా, కడపజిల్లా చిట్వేల్ మండలం సిఎం రాచపల్లి గ్రామానికి చెందిన పి.నరసింహరాజు, సంధ్య..వారి కుటుంబసభ్యులు మోక్షిత్, వేదాన్ష్ తదితరులు ఆన్‌లైన్ ద్వారా స్వామివారి ఆలయానికి మరో లక్షా 9వేల రూపాయలు విరాళంగా సమర్పించినట్లు ఇఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఏదేమైతేనేం.. ఇలాంటి దాతలవల్ల కోనకు వచ్చే భక్తుల అన్నప్రసాద వితరణకి ఎలాంటి లోటు లేదు. అంతా ఆ పెంచలస్వామి దయ!..

## పూర్వ విద్యార్థులంటే.. ఇలా ఉండాలి మరి!

ఇటీవలి కాలంలో సమాజంలో సేవాభావం క్రమంగా పెరుగుతోంది. ఇది మంచి పరిణామం. ముఖ్యంగా, పాఠశాలల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు తాము చిన్నతనంలో చదువుకున్న పాఠశాలలను గుర్తుపెట్టుకుని, ఆ పాఠశాలలు, లేదా విద్యాలయాలకు వచ్చి తమకు చదువుచెప్పి ప్రయోజకుల్ని చేసిన గురువులను ఆత్మీయంగా పలకరించి సన్మానాలు చేయడం వంటివి గత కొద్దికాలంగా అనేక ప్రాంతాల్లో జరుగుతున్నాయి. అంతేకాదు, ఇప్పుడు వాళ్ళు పెద్దవాళ్లయినా..ఎక్కడెక్కడో దూరప్రాంతాల్లో స్థిరపడినా, అప్పట్లో తమతో చదువకున్నవారందరినీ కలిసేందుకు, ఆత్మీయ సమావేశాలు కూడా నిర్వహిస్తూ, ఆ పాఠశాలల అభివృద్ధికి తమవంతు చేయందిస్తున్నారు కూడా. మండల కేంద్రమైన విడవలూరు జడ్పీ హైస్కూల్‌లో 1972-73 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు కూడా ఇదేవిధంగా ఈనెల 23న ఆ పాఠశాలలో కలసి, ఆ బడిలో చదువుకున్న రోజులను గుర్తుచేసుకుంటూ ఆనందించారు. అంతేకాదు, తమ భవిష్యత్తుకు బాటలు వేసిన ఆ పాఠశాలకు అవసరమైన బెంచీలను 90వేల రూపాయలు ఖర్చుపెట్టి ఏర్పాటుచేశారు. విద్యార్థులు భోజనాలు చేసేందుకు అనువుగా భోజనశాలను బాగుచేశారు. వారితోపాటు దాతలు సోమవరపు జనార్ధన్‌రెడ్డి, దేవెళ్ళ శ్రీనివాసులురెడ్డి, వాసిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మహంకాళి ప్రభాకర్‌రెడ్డి, ఉప్పలమర్తి కృపాకర్‌రెడ్డి, కాకు సుబ్రహ్మణ్యంల సహకారంతో పాఠశాలకు అవసరమైన కనీసవసతులు కూడా ఏర్పాటుచేశారు. పూర్వవిద్యార్థులంంటే ఇలా ఉండాలి మరి.. అని ఆదర్శంగా నిలిచారు.

## టూకీగా...



### కావలిలో 'మెప్మా'బజార్

నాణ్యమైన వస్తువులను, అతితక్కువ ధరకే విక్రయించేందుకు కావలిలో ఈనెల 25న మెప్మా బజార్ ప్రారంభమైంది. పొదుపు సంఘాల మహిళల ఆధ్వర్యంలో, స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారుచేసిన వస్తువులు, రాగిపిండి, వడియాలు, ఊరగాయలు, మగ్గంతో నేసిన చీరలు, ఎంబ్రాయిడరీ వస్తువులు వగైరాలు ఇక్కడ చౌకధరకే లభిస్తాయి.

### నాగులవరంలో నవగ్రహారాధన

మహాశివరాత్రి సందర్భంగా, బోగోలు మండలంలోని నాగులవరం గ్రామంలో ఉన్న శ్రీ గంగా పార్వతి సమేత శివాలయంలో పెద్దఎత్తున నవగ్రహారాధన జరిగింది. కండ్లగుంట మధుబాబునాయుడు-సౌజన్యల ఆధ్వర్యంలో రుద్రాభిషేకం తదితర పూజలు వైభవంగా జరిగాయి. సర్పంచ్ రామారావు, మాజీ సర్పంచ్‌లు పద్మనాభం కృష్ణయ్య, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

### అనుమసముద్రంపేటలో.. 'జ్ఞానజ్యోతి'

అనుమసముద్రంపేటలో అంగన్‌వాడీల మొదటి విడత శిక్షణకు సంబంధించి 'జ్ఞానజ్యోతి' ముగింపు కార్యక్రమం ఈనెల 25న జరిగింది. స్థానిక జడ్పీ స్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఇఓ సాయిప్రసాద్, ఐసీడీఎస్ సీడీపీఓ సునీత పాల్గొన్ని శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్లు అందజేశారు. రిసోర్స్ పర్సన్ సుబ్బయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ముదివర్తిలో మట్టి అక్రమ రవాణా

విడవలూరు మండలం ముదివర్తిలో అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఈనెల 25న పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. మట్టి అక్రమరవాణా జరుగుతున్న విషయాన్ని గ్రామస్తులు పోలీసులకు తెలియజేయడంతో, వారు ఆ వాహనాలను పట్టుకున్నట్లు సమాచారం.

### వెంకటేశ్వరపురంలో పాడిపశువులకు మందులు

నెల్లూరు నగర శివార్లలోని వెంకటేశ్వరపురంలో ఈనెల 25న పాడిరైతులకు పశువుల పెంపకం పట్ల అవగాహన కలిగించారు. వెటర్నరీ పాలీక్లినిక్ డీడీ సోమయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, పెయ్యదూడల పెంపకం ఎలా ఉండాలో చెప్పారు. పశువులను పరీక్షించి, లేగదూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు.

### మహిమలూరులో రైతులకు అవగాహన

ప్రతిరైతుకు పంట నమోదు తప్పనిసరని, మార్చి 3వ తేదీ లోగా రైతులు తమపేర్లు నమోదు చేసుకోవాలని ఆత్మకూరు మండలం మహిమలూరు గ్రామంలో జరిగిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో రైతులకు వ్యవసాయ అధికారిణి దేవసేనమ్మ చెప్పారు. ఈనెల 25న ఆమె రైతులతో మాట్లాడుతూ, సొంతభూములు కలిగిన రైతులు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కూడా పొందాలన్నారు.

### విడవలూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం

విడవలూరులో ఈనెల 25న ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభమైంది. మండల వ్యవసాయాధికారి పి.వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ, ఈ కేంద్రంలో ధాన్యం విక్రయించుకునే రైతులకు ప్రభుత్వం సూచించినమేరకు గిట్టుబాటు ధర ఇస్తారన్నారు. రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పలువురు రైతులు, రైతు నాయకులు పాల్గొన్నారు.

### కలువాయిలో బీసీ రుణాలపై సమావేశం

ప్రభుత్వం ఇస్తున్న బీసీ రుణాలకు సంబంధించి లబ్దిదారుల ధృవీకరణ కోసం ఈనెల 25న కలువాయి ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించి, లబ్ధిదారుల సర్టిఫికెట్లను పరిశీలించారు. రుణాల మంజూరుకు లబ్దిదారులకు అవగాహన కలిగించారు.

### బుజబుజనెల్లూరులో వైజ్ఞానిక ప్రదర్శన

నెల్లూరు సమీపంలోని బుజబుజనెల్లూరులో ఉన్న శ్రీనివాస పాఠశాలలో ఈనెల 25న వైజ్ఞానక ప్రదర్శన నిర్వహించారు. ఎంఇఓ తిరుపాల్ పాల్గొని విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తి పెంచుకుని శాస్త్రవేత్తలుగా తయారుకావాలని చెప్పారు. వేదాయపాళెం ఏఎస్ఐ మునిరావు, కార్పొరేటర్ బి.నరసింహగిరి, కరెస్పాండెంట్ సుబ్బయ్య పాల్గొన్నారు.

## ఈ తరాన్ని తరింపజేసిన.. ఆధ్యాత్మిక అద్భుతం

# మహా కుంభమేళా!



- 65 కోట్ల భక్తజనంతో... ఘనంగా ముగిసిన మహోజ్వల ఘట్టం
- భారత్ సత్తాకు జేజేలు పలుకుతున్న యావత్ ప్రపంచం

*అచెంచల భక్తిభావంతో ప్రపంచ యవనికపై భారత్ చెరగని ముద్రవేసింది. అంతర్జాతీయ ఆధ్యాత్మికవేత్తలే అచ్చెరువొందేలా మహా కుంభమేళా ద్వారా త్రివేణీ సంగమంలో కోట్లాదిమందిని పుణ్యస్నానాలతో తరింప చేసింది. నలభై అయిదు రోజుల పాటూ జలహారతులు, విశేషపూజలతో ప్రపంచం మొత్తం మనవైపు చూసేలా మహాద్భుత ఘట్టాన్ని ఘనంగా ముగించింది. 144ఏళ్లకు ఒకసారి వచ్చే మహాకుంభమేళాను 'నభూతో నభవిష్యతి' అన్న రీతిలో విజయవంతం చేసింది. 65 కోట్ల మందికి పైగా భక్తులు స్వేచ్ఛగా పవిత్రస్నానమాచరించే మహోజ్వల ఘట్టాన్ని కట్టుదిట్టంగా నిర్వహించింది. భారతీయ సంస్కృతి సంప్రదాయాల ప్రాభవాన్ని విశ్వవ్యాప్తం చేసింది. ఇంతటి మహత్కార్యాన్ని క్షేత్రస్థాయిలో ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా నిర్వహించడం నిజంగా అనన్య సామాన్యం, అనితరసాధ్యం. అందుకే యావత్ ప్రపంచం 'భళా భారత్' అంటూ నీరాజనాలు పలుకుతోంది. నమ్మశక్యంకాని నిజాన్ని కళ్లముందుకు తెచ్చి చూపించిందంటూ జేజేలు పలుకుతోంది. ఇది ఒక్క భారత్‌కే సాధ్యం అంటూ కీర్తిస్తోంది.*

### ప్రతి విషయం ప్రపంచ రికార్డే అన్నట్లుగా..

శూన్యం నుంచి సైన్యంలా పుట్టుకొచ్చిన లక్షలాది మంది అఘోరాలు, హిమాలయాల నుంచి తరలివచ్చిన యోగులు, సిద్ధులు, 100 దేశాల నుంచి కదలివచ్చి పాలుపంచుకున్న వేలాదిమంది విదేశీ భక్తులు, వివిధ మఠాల నుంచి హాజరైన ఆళ్వార్లు, జియ్యర్‌లు, తండోపతండాలుగా వచ్చిన 65 కోట్లమంది జనం... వెరసి మహా కుంభమేళాలో ప్రతి విషయం కూడా ప్రపంచ రికార్డే అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ ఏడాది జనవరి 13వ తేదీన ఉత్తరప్రదేశ్‌లోని గంగ, యమున, సరస్వతి నదుల సంగమ స్థానమైన ప్రయాగ్ రాజ్‌లో మహాకుంభమేళా ప్రారంభమైంది. దశాబ్దాల చరిత్ర ఉన్న ఈ కుంభమేళాలో మన దేశంలోని దాదాపు 50శాతం ప్రజలు పుణ్యస్నానాలు ఆచరించడం విశేషం. ఇందులో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, వ్యాపార, సినీ, రాజకీయ ప్రముఖుల నుంచి అతి సామాన్యుల వరకు ఉండడం గమనార్హం. ఇక ఒక్క మౌని అమావాస్య రోజే 8కోట్ల మంది భక్తులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానమాచరించడం నిస్సందేహంగా చరిత్రాత్మక ఘట్టమే.

### రెండేళ్ల కసరత్తు.. వెయ్యేళ్ల కీర్తి

సాధారణంగా గురుగ్రహం రాశి మార్పు చెందే కాలంలో మనదేశంలో ఏటా ఏదో ఒక నదికి పుష్కరాలు రావడం సహజం. ఈ క్రమంలో 12 ఏళ్లకి ఒకసారి కుంభమేళాలు వస్తుంటాయి. అయితే, 12 కుంభమేళాల అనంతరం 144 ఏళ్లకు ఒకసారి మహాకుంభమేళా రావడం అత్యంత అరుదు. మూడు, నాలుగు తరాలకి ఒకసారి మాత్రమే ఈ అద్భుత ఘట్టంలో పాలుపంచుకోవడం సాధ్యమవుతుంది. ఎందుకంటే స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మనదేశంలో కొన్ని కుంభమేళాలు జరిగినా మహా కుంభమేళా మాత్రం 1881 తరువాత మళ్ళీ 2025లోనే సాకారమైంది. మాటలకందని ఇంతటి మహత్కార్యాన్ని పక్కా ప్రణాళికతో, ఊహకందని ఏర్పాట్లతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సమర్ధవంతంగా నిర్వహించింది. ఇందుకోసం వేలాది ఎకరాల్లో మహాకుంభ్ ప్రాంతాన్ని తీర్చిదిద్దింది. ఇక్కడ ఏర్పాటుచేసిన తాత్కాలిక టెంట్లలో అన్ని సౌకర్యాలను కల్పించింది. కోట్లమంది హాజరయ్యే ఈ మహాఘట్టంలో జపాన్ టెక్నిక్‌తో స్వచ్ఛమైన గాలి అందించింది. మయావాకి అనే సాంకేతికతతో కాలుష్యాన్ని నియంత్రించింది. అలాగే భక్తులు నదుల్లో జారవిడిచే లక్షలాది టన్నుల పూజా సామాగ్రిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసి స్వచ్ఛమైన నీటిలో ప్రజలు గంగమ్మ తల్లికి నీరాజనాలర్పించే అవకాశం కల్పించింది. ఇందుకోసం రెండేళ్ళపాటు పకడ్బందీగా కార్యాచరణ రూపొందించి వెయ్యేళ్లకు సరిపడే కీర్తిని యోగి ప్రభుత్వం భారతదేశానికి సంపాదించి పెట్టిందనడంలో అతిశయోక్తి లేదు.

### భద్రత భేష్.. భేష్!

దాదాపు 65 కోట్ల మంది పాల్గొన్న ఆధ్యాత్మిక వేడుకలో చిన్నపాటి భద్రతా లోపం కూడా లేకుండా వేలాదిమంది ఉత్తరప్రదేశ్ పోలీసులు, కేంద్రప్రభుత్వ బలగాలు కుంభమేళా ప్రాంతాన్ని కంటికి రెప్పలా కాపాడాయి. నిఘా బృందాలు నిత్యం అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం ఇవ్వకుండా పనిచేశాయి. ఇక వందలాది ప్రత్యేక (చార్టెడ్) విమానాలు, వేలాది ప్రత్యేక బస్సులు, లక్షలాది ప్రైవేటు వాహనాలు కుంభమేళా కోసం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్నాయి. వీటన్నింటికి అవసరమైన పార్కింగ్ సౌకర్యం కల్పిస్తూనే, రద్దీ నియంత్రణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. ఇక డ్రోన్ కెమెరాలతో భద్రతా పర్యవేక్షణ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ)తో కార్యక్రమాలను సమన్వయం చేయడం కుంభమేళాకే హైలెట్‌గా నిలిచింది. ఇక స్పెషల్ ట్రైన్‌లలో భక్తులను ఎప్పటికప్పుడు కుంభమేళా ప్రాంతానికి తీసుకొచ్చారు. కుంభమేళా నిర్వహణలో యూపీ ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలను, నిర్వాహకుల చిత్తశుద్ధిని ఎంత మెచ్చుకున్నా తక్కువే అనడంలో ఎలాంటి సందేహం లేదు.

### అదృష్టమంటే ఈ తరానిదే..

కరోనా.. ప్రపంచానికి మరిచిపోలేని ఓ చేదు జ్ఞాపకం. క్షణం తీరిక లేకుండా పరిగెత్తే జనాన్ని, చివరికి ఇంటి గుమ్మం కూడా దాటకుండా చేసిన మహమ్మారి. బయట వ్యక్తులనే కాదు, అయినవారినీ దగ్గరకు రాకుండా దూరం చేసిన రాకాశి. ఇంతటి మహావిపత్తును చూసిన నేటితరం, మహా కుంభమేళాతో ఆధ్యాత్మిక అద్భుతాన్ని కూడా చవిచూసింది. అవును, కుంభమేళా 45 రోజులలో కోట్లాది మందిని ఒకచోటికి చేర్చింది. 6 వారాలలో రూ.2 లక్షల కోట్ల వ్యాపారం చేయించింది. అదే ఆరు వారాలలో 100 దేశాల ప్రజలను భారత భూభాగంలోకి ఆహ్వానించింది. అదే 45 రోజులలో ఎంతోమందికి జీవితానికి సరిపడా అనుభవాలను అందించింది. ఎంతో మందిని ప్రపంచానికి పరిచయం చేసింది. ఎంతోమందికి ప్రపంచమంటే ఏంటో తెలియజేసింది. శివరాత్రి పర్వదినం (ఫిబ్రవరి 26)తో ముగిసిన కుంభమేళా భూమిపై మానవుడు అనుభవించిన ఒక అపురూప అనుభూతి. కళ్ళారా చూసిన ఒక మహా అద్భుతం. ఈ మహోజ్వల ఘట్టంలో పాలుపంచుకున్న ఈ తరం తరించింది. మరో 144 సంవత్సరాల తరువాత అంటే.. 2169లో మళ్ళీ మహా కుంభమేళా జరిగేవరకూ భవిష్యత్ తరాలు గొప్పగా చెప్పుకునేలా ఈ మహోన్నత కార్యక్రమాన్ని నిర్వహించిన భారతదేశ ఘనత అజరామరం... ఆచంద్రతారార్కం...!

---

### అవధాని కోట రాజశేఖర్ గాత్రంతో రూపొందిన..

## 'రామాయణం' ఆడియో ఆవిష్కరణ



నెల్లూరు అవధాని, బాలకాండ పద్యానువాదకులు, విశ్రాంత సంస్కృత ఉపన్యాసకులు కోట రాజశేఖర్‌కు ఇటీవల విశాఖలో ఘన సన్మానం జరిగింది. ఆదికవి వాల్మీకి సంస్కృతంలో రచించిన శ్రీ మద్రామాయణంలోని ఏడుకాండల్లో ఉన్న 24వేల శ్లోకాలను సుమారు మూడేళ్ళపాటు అహర్నిశలు శ్రమించి, తన మధురగానంతో ఆడియో సీడీలుగా రూపొందించి, విశాఖపట్నంలో ఆవిష్కరించిన సందర్భంగా ఆయన్ను అక్కడి పండితులు, నెల్లూరుకు చెందిన పలువురు సాహితీప్రముఖులు అభినందించి.. ఘనంగా సత్కరించారు. విశ్వవిఖ్యాతమైన వాల్మీకి రామాయణాన్ని ఆడియో సీడీలుగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న రామభక్తులకు, రామాయణం పారాయణం చేసేవారికి ఉపకరించే విధంగా తయారుచేయడం ఎంతో కష్టసాధ్యమైన పని అయినప్పటికీ, ఆ మహత్కార్యాన్ని కోట రాజశేఖర్ ఎంతో ప్రతిభావంతంగా నిర్వహించారంటూ వక్తలు కొనియాడారు. విశాఖ వాస్తవ్యులు.. రామభక్తులు అడవికొలను జ్యోత్స్నా వెంకట్ దంపతుల సారధ్యంలో, వారి కుమారుడు రోహిత్ చక్రపాణి సౌజన్యంతో ఈ ఆవిష్కరణోత్సవం కార్యక్రమం ఆద్యంతం వైభవంగా జరిగింది. మహాభారతం వచనానువాదకులు.. శతావధాని డా.సూరం శ్రీనివాసులు (నెల్లూరు) సభకు అధ్యక్షత వహించారు. నవరస కవి చక్రవర్తి నల్లాన్ చక్రవర్తుల శ్రీరామచక్రవర్తి (హైదరాబాద్), ప్రొఫెసర్ తంబిశెట్టి రామకృష్ణ (బెంగుళూరు), లీడర్ పత్రిక సంపాదకులు వివి రమణమూర్తి (విశాఖ), ప్రముఖ సాహితీవేత్త మేడా మస్తాన్‌రెడ్డి, మేడా శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నెల్లూరుజిల్లా ఇనమడుగులోని శ్రీ సత్యానందాశ్రమం స్వామీజీ, శ్రీ పురుషోత్తమతీర్థస్వామి ఈ రామాయణం శ్లోకాల ఆడియో సీడీలను ఆవిష్కరించారు. డాక్టర్ గాత్రం రామకృష్ణ పరమహంస, అడవికొలను వెంకట్, భీమేశ్వరరావు, జ్యోత్స్నాకుమారి, చిటితోటి విజయకుమార్, సాంకేతిక నిపుణులు కొప్పోలు ఎస్ఎస్ఆర్ ప్రసాద్, కవయిత్రి పాలపర్తి అవీలా, విట్టుబాబు, గాయకులు మధునాపంతుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమారి కర్రా నాగవైష్ణవి కర్నాటక గాత్ర కచేరీ శృతిపక్వంగా ఉండి శ్రోతలను అలరించింది.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com